
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

కర్నూలు జిల్లా వార్తలు 5

శనివారం 5 జూలై 2025

ఆన్‌లైన్‌లో ఉచిత స్పర్శ దర్శనం టికెట్లు

శ్రీశైలం, జూలై 4(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో ఉచిత స్పర్శ దర్శనం టికెట్లు ఆన్‌లైన్‌లో పొందవచ్చునని ఏవో శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఉచిత స్పర్శ దర్శనానికి సంబంధించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారంలో నాలుగు రోజులు మంగళవారం నుంచి శుక్రవారం వరకు అందుబాటులో ఉంటాయన్నారు. రోజుకు వెయ్యి టోకెన్లు ఆన్‌లైన్‌లో జారీ చేస్తామన్నారు. దర్శనానికి ఒక్క రోజు ముందు టోకెన్లు తీసుకోవాలని అన్నారు.

'అల్లూరి' స్ఫూర్తితో సేవ చేద్దాం

● ఇన్‌చార్జి కలెక్టర్ నవ్య



నివాళులర్పిస్తున్న అధికారులు, సంఘం నాయకులు

కర్నూలు కలెక్టరేట్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర సమర యోధుడు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ప్రజలకు సేవలు చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ డా.బి. నవ్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా యువజన సంక్షేమ, గిరిజన సం క్షేమ శాఖల ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ నవ్య మాట్లాడుతూ అల్లూరి స్ఫూర్తితో మనం దేశభక్తిని మరింత పెంచుకోవాలన్నారు. ప్రజలకు మరింతగా సేవలు చేయాలని సూచించారు. డీఆర్వో వెంకట నారాయణమ్మ, సెట్కూరు సీఈవో డా. వేణుగోపాల్, ఇన్‌చార్జి ట్రైబల్ ఆఫీసర్ (ఎస్‌డీసీ) కొండయ్య, కలెక్టరేట్ ఏవో శివరాముడు, టూరిజం అధికారి విజయ, సివిల్ సప్లయ్ డైరెక్టర్ మహేష్ నాయుడు, తహసీల్దార్ రమేష్, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు గోవింద్ సింగ్, వెంకటేశ్వర్లు, శ్రీనాథ్, ఇంద్రాణి, ఎరుకుల హక్కుల పోరాట సమితి నాయకులు ఎరుకుల రాజు, కుశలన్న, హరి ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రామరాజు, చంద్రప్ప, వెంకటేశ్, లంబాడ సంఘం నాయకులు యోగేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్‌గా సాయికృష్ణ



కర్నూలు హాస్పిటల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్‌గా డా.సాయికృష్ణ ప్రకాష్ శుక్రవారం మళ్లీ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఆయన రాజమహేంద్రవరం ప్రభుత్వ మెడికల్ కాలేజీకి వెళ్లారు. స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్‌గా కర్నూలుకు రావడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో రేడియోథెరపీ ప్రొఫెసర్ డా. కృష్ణప్రకాష్ అవసరం దృష్ట్యా ప్రభుత్వం తిరిగి ఆయన్ను డైరెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ఈ నెల 1వ తేదీ రిలీవింగ్ ఆర్డర్స్ జారీ చేయగా.. ఆయన రాజమండ్రిలో రిలీవ్ అయి కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు రిపోర్టు చేసి శుక్రవారం తిరిగి కర్నూలు స్టేట్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

కేసుల సత్వర పరిష్కారానికి రాజీ మార్గం

● న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి

● 12న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకటశేషాద్రి

కర్నూలు లీగల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కక్షిదారులకు సత్వర న్యాయాన్ని అందించేందుకు జాతీయ లోక్ అదాలత్ రాజీ మార్గం ద్వారా కృషి చేస్తుందని కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకటశేషాద్రి తెలిపారు. శుక్రవారం స్థానిక న్యాయ సేవా సదన్ భవనంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాజీ మార్గమే రాజమార్గమని, న్యాయం కోసం ఏళ్ల తరబడి ఎదురు చూడకుండా సత్వర న్యాయం అందించేందుకు లోక్ అదాలత్‌లు కృషి చేస్తున్నాయని తెలిపారు. ఇందు కోసం ఈ నెల 12వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌ను జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ధి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 16 లోక్ అదాలత్ బెంచ్‌లను ఏర్పాటు చేసి అధిక సంఖ్యలో కేసుల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

కాలువలు కబ్జా



కర్నూలు నగరంలో హంద్రీ నదీతీరం వెంబడి కబ్జాలు

ఆక్రమణలకు హద్దేముంది? సాగునీటి కాలువలపై కూడా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. కైకలూరు పట్టణంలోని ఓ కాలువపై అక్రమంగా వంతెన నిర్మించిన కేసులో రాష్ట్ర హైకోర్టు తీవ్రంగా స్పందించింది. ఆక్రమణలు గుర్తించి తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. అందులో భాగంగానే శుక్రవారం జాయింట్ కలెక్టర్ బి. నవ్య జిల్లాలో హంద్రీ, ఎల్లెల్సీ, మైనర్ ఇరిగేషన్ చెరువుల ఆక్రమణలను తొలగించాలని జలవనరుల శాఖ ఇంజనీర్లను ఆదేశించారు. తాత్కాలిక నిర్మాణాలు, షెడ్లు తొలగించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఆ వివరాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

● ఎమ్మిగనూరు, పెద్దహరివాణంలో ఎల్లెల్సీ డిస్ట్రిబ్యూటరీ కాలువపై షెడ్లు

● సి. బెళగల్‌లో చెరువు కాలువ కబ్జా

● కర్నూలులో దర్జాగా హంద్రీ ఆక్రమణలు

● తొలగించాలని టెలీ కాన్ఫరెన్స్‌లో జేసీ నవ్య ఆదేశం

● అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం

కర్నూలు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిత్యం కరువుతో తల్లడిల్లే పశ్చిమ ప్రాంతం జలజీవనాడి తుంగభద్ర దిగువ కాలువ. ఎమ్మిగనూరు పట్టణం, కర్నూలు నగరంతో పాటు వివిధ ప్రధాన గ్రామాల్లో ఈ కాలువ ప్రవహిస్తుంది. ఒకప్పుడు పట్టణాలు, గ్రామాలకు దూరంగా ఉన్న డిస్ట్రిబ్యూటరీ (డీపీ) కాలువలు జనవాసాలు పెరగడంతో నివాసాలు మధ్యలోకి వచ్చాయి. ఎమ్మిగనూరు పట్టణంలో టీబీపీ ఎల్లెల్సీ డీపీ-79 కాలువ ఎస్‌ఎస్ ట్యాంక్ నుంచి లక్ష్మణ్ సినిమా థియేటర్, ఓంశాంతి కూడలి, వ్యవసాయ మార్కెట్ యార్డు మీదుగా ముగతి వరకు ప్రవహిస్తుంది. కాలువ వెడల్పు 10 అడుగులు, కుడి గట్టు 33 అడుగులు, ఎడమ గట్టు 13 అడుగులు కలిపి 56 అడుగుల వెడల్పుతో ఉన్న డీపీ-79 కెనాల్ ఎక్కడికక్కడ ఆక్రమణలకు గురై కుచించుకుపోయింది. ఇప్పుడు ఈ కాలువ 10-15 అడుగులు కూడా లేదు. బళ్లారి-జడ్చర్ల వయా ఆదోని, ఎమ్మిగనూరు జాతీయ రహదారి-167 ఈ కాలువ పక్కనే ఉంది. దీంతో వాణిజ్య పరంగా డిమాండ్ పెరిగింది. రాజకీయ అండదండలతో కాలువ గట్లను ఆక్రమించేశారు. తాత్కాలిక రేకుల షెడ్లు నిర్మించుకొని వివిధ వ్యాపారాలు చేస్తున్నారు. కొందరు రాజకీయ బడాబాబులే ఆక్రమించి రేకుల షెడ్లు వేసి బాడుగకు ఇచ్చారని తెలుస్తున్నది. లక్ష్మణ్ సినిమా థియేటర్, ఓంశాంతి సర్కిల్, మార్కెట్ యార్డు సర్కిల్ వద్ద కాలువపై ఆక్రమణలు దాదాపు వందకు పైగా ఉన్నాయని సమాచారం. ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామంలో కూడా ఇదే పరిస్థితి ఉంది. ఆదోని-సిరుగుప్ప ప్రధాన రహదారిలో డిమాండ్ ఉండడ డంతో ఎల్లెల్సీ డీపీ-65 కాలువ (ఫీల్డ్ ఛానల్) గట్టను కొందరు ఆక్రమించి 10-15 తాత్కాలిక షెడ్లు వేసుకున్నట్లు గుర్తించారు. మండల కేంద్రం సి. బెళగల్‌లో చెరువు స్థలం, ఫీల్డ్ ఛానల్ కబ్జా చేసి తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసుకున్నారని ఇరిగేషన్ అధికారులు గుర్తించారు.



ఎమ్మిగనూరు పట్టణం ఓంశాంతి సర్కిల్ దగ్గర ఎల్లెల్సీ డీపీ-79 కాలువపై ఏర్పాటు చేసిన తాత్కాలిక దుకాణాలు

నోటీసులు జారీ చేసి తొలగిస్తాం

ఆదోని మండలం పెద్దహరివాణం, ఎమ్మిగనూరు పట్టణాల్లో ఎల్లెల్సీ డీపీ-65, 79 కాలువ గట్లు కబ్జాలకు గురైన మాట నిజమే. తాత్కాలిక షెడ్లు వేసుకొని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. నోటీసులు జారీ చేసి వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.

- పాండురంగయ్య, టీబీపీ ఎల్లెల్సీ ఈఈ ఆదోని, ఎస్ఈ, హంద్రీనీవా కర్నూలు సర్కిల్-1

హంద్రీ ఇరువైపు 338 ఆక్రమణలు

కర్నూలు నగరంలో హంద్రీ నది కుడి గట్టు (రైట్ బ్యాంక్) వైపు 164 ఆక్రమణలు గుర్తించారు. ఓ బడా రియల్టర్ సర్వే నంబరు 424/ఏ, 470/బిలో 15 ప్లాట్లు వేసి పక్కా భవనాలు నిర్మించారని. సర్వే నంబరు.470/బిలో 25 ప్లాట్లలో బెస్‌మట్టం వరకు నిర్మాణాలు చేపట్టారని, ఇవి ఆక్రమిత స్థలం, బఫర్ జోన్‌లో ఉన్నాయని ఇరిగేషన్ అధికారులు గుర్తించి నివేదిక ఇచ్చారు. సర్వే నంబరు.740/బి, 498/ఎ, 533, 24 పరిధిలో పలువురు 1.25 సెంట్లలో పక్కాభవనాలు, రేకుల షెడ్లు ఏర్పాటు చేసుకోగా, కొందరికి రెవెన్యూ అధికారులు డి-పట్టా ఇచ్చినట్లు తెలుస్తోంది. ఓ వెంచర్ యజమాని 40 సెంట్లు హంద్రీ నది ప్రభుత్వ పోరంబోకు భూవి ఆక్రమించినట్లు గుర్తించారు. ఎడమ గట్టు (లెఫ్ట్ బ్యాంక్) వైపు 174 ఆక్రమణలు ఉంటే.. మెజార్టీగా ఆర్‌సీసీ భవనాలు నిర్మించుకున్నారు. సర్వే నంబరు.770/ఎఫ్‌లో ఓ ఫైనాన్స్ సంస్థ భవనం కొంతభాగం హంద్రీ నది ఒడ్డున ఉన్నట్లు అధికారులు గుర్తించారు. రెండు నెలలు క్రితం జలవనరుల శాఖ ఎఫ్‌ఆర్‌ఎల్ డివిజన్ ఇంజనీర్లు, రెవిన్యూ అధికారులు సర్వే చేసిన హంద్రీ సరిహద్దులు గుర్తించి బౌండరీ పిల్లర్లు పాతారు.

ఆక్రమణలపై జేసీ సీరియస్

కర్నూలు నగరంలో హంద్రీ ఆక్రమణలు, ఆదోని మండలం పెద్దహరివాణం, ఎమ్మిగనూరు పట్టణంలో టీబీపీ ఎల్లెల్సీ డీపీ-65, 79 కాలువలపై తాత్కాలిక ఆక్రమణ తక్షణమే తొలగించాలని జాయింట్ కలెక్టర్ (జేసీ) బి. నవ్య జలవనరుల అధికారులను ఆదేశించారు. కళ్లముందే కాలువ గట్టు ఆక్రమిస్తుంటే కళ్లకు గంతలు కట్టుకున్నారా..? అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కైకలూరులో కాలువపై అక్రమ వంతెన నిర్మాణంపై హైకోర్టు సీరియస్ కావడంతో జిల్లాలో కాలువలు, నదుల ఆక్రమణలపై జేసీ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. తాత్కాలిక షెడ్లను తక్షణం తొలగించాలని, పక్కా భవనాలకు నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు సమాచారం. అయితే.. నగరంలో మునగాలపాడు నుంచి పరిదంపాడు వరకు కేసీ కాలువ గట్టు ఇరువైపు కబ్జాకు గురయ్యాయి. శాశ్వత భవనాలు నిర్మించుకున్నారు. ఉల్చాల రోడ్డు, రేడియో స్టేషన్, ఆటో నగర్, బాబు జగ్జీవన్‌రాం కాలనీ ప్రాంతాల్లో రూ.కోట్లు విలువైన టీబీపీ కర్నూలు బ్రాంచి కెనాల్ ఆక్రమణల వల్ల కాల్వ కనుమరుగైంది. వీటిపై జేసీ చర్చించకపోవడం కొసమెరుపు.

ఆలూరులో అయోమయం..!

ఇన్‌చార్జి, సీనియర్ నాయకులు లేకుండానే టీడీపీ 'తొలి అడుగు'

జగన్‌కు పాదయాత్ర చేసే అర్హత లేదు: మంత్రి బీసీ

స్కూల్ బస్సు కిందపడి విద్యార్థిని మృతి

వివరాలు 7లో...

అప్పటి డీఎంహెచ్‌వోకు జైలు శిక్ష

కర్నూలు లీగల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆదోనిలో ఓ నర్సింగ్ హోం, స్కానింగ్ సెంటర్ రెన్యువల్ చేయడానికి లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన అప్పటి కర్నూలు డీఎంహెచ్‌వోకు మూడు సంవత్సరాల కఠిన కారాగారశిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ కర్నూలు ఏసీబీ కోర్టు న్యాయాధికారి ఎస్. శ్రీవిద్య తీర్పు చెప్పారు. ఆదోనికి చెందిన డా.బి. శ్రీనివాసులు తన నర్సింగ్ హోం, స్కానింగ్ సెంటర్‌లో రెన్యువల్ కోసం అప్పటి కర్నూలు డీఎంహెచ్‌వోకు దరఖాస్తు చేసుకున్నారు. ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా పని చేస్తున్న అప్పటి కర్నూలు ప్రాంతీయ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ డా.ఎం. మీనాక్షి మహాదేవ్ రూ.30వేలు లంచంగా డిమాండ్ చేశారు. దీంతో డా.బి. శ్రీనివాసులు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. 2017 జూన్ 2వ తేదీన నిందితురాలు డా.ఎం మీనాక్షి మహాదేవ్ ఫిర్యాది నుంచి రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు వలపన్ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆ తర్వాత ఆమెపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. నిందితురాలిపై కోర్టులో నేరం రుజువు కావడంతో మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి ఎస్. శ్రీవిద్య తీర్పు ఇచ్చారు. ఫిర్యాదికి రూ.19,500 నష్టపరిహారం కూడా చెల్లించాలని కోర్టు నిందితురాలిని ఆదేశించారు.

పార్టీ కోసం కష్టపడ్డవారికే పదవులు

● చంద్రబాబుతోనే సుపరిపాలన ● ఎంపీ నాగరాజు



సుపరిపాలన గురించి వివరిస్తున్న నాయకులు

దేవనకొండ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారికే టీడీపీలో పదవులు వరిస్తాయని కర్నూలు ఎంపీ నాగరాజు అన్నారు. స్థానిక మూగితాత ఫంక్షన్ హాలులో శుక్రవారం మండలంలోని టీడీపీ శ్రేణులతో సమావేశం జరిగింది. ఇందులో ఆయన మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గంలో విభేదాల కారణంగా త్రిసభ్య కమిటీని పార్టీ నియమించిందని అన్నారు. ఏవైనా సమస్యలుంటే కమిటీ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. ఆర్టీసీ చైర్మన్ పూల నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో తీసుకెళ్లేందుకు సీఎం చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి మాట్లాడుతూ కిందస్థాయి కార్యకర్తలు కుడా క్షేత్రస్థాయిలో కూటమి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. వాల్మీకి చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, మాజీ ఎంపీ పీ రామచంద్రనాయుడు, కన్వీనర్ విజయభాస్కర్, రంగన్న, సుభాన్, మలకన్న, మల్లికార్జునగౌడ్, రామరావునాయుడు, ఉచ్చీరప్ప, వీరేష్, కప్పట్రాళ్ల మల్లికార్జున, సర్పంచు బాస్కర్ పాల్గొన్నారు.

సీనియర్ ఎంటమాలజిస్టుగా సి. చంద్రశేఖర్‌రావు



కర్నూలు హాస్పిటల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా మలేరియా నియంత్రణ శాఖ కార్యాలయంలో అసిస్టెంట్ మలేరియా అధికారిగా ఉన్న సి. చంద్రశేఖర్‌రావు పదోన్నతిపై కర్నూలు జేఈవీఎం యూనిట్ సీనియర్ ఎంటమాలజిస్టుగా నియమితులయ్యారు. శుక్రవారం విజయవాడ నుంచి డైరెక్టర్ ఆఫ్ హెల్త్ నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్‌లో చంద్రశేఖర్‌రావు సీనియయర్ ఎంటమాలజిస్టుగా పదోన్నతి పొందారు.

తొలి అడుగులో ఉద్రిక్తత...!

● మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్‌రెడ్డిపై దాడి

● ఇంటి అద్దాలు ధ్వంసం

● ఎంపీ బైరెడ్డి శబరి వాహనాన్ని అడ్డుకున్న టీడీపీ శ్రేణులు

● ఆత్మకూరులో టెన్షన్.. టెన్షన్

ఆత్మకూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'తొలి అడుగు' కార్యక్రమం ఉద్రిక్తతలకు దారితీసింది. శ్రీశైలం నియోజకవర్గ కేంద్ర బిందువైన ఆత్మకూరులో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్థానిక టీడీపీ శ్రేణులు నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి పర్యటనను అడ్డుకున్నారు. అదేక్రమంలో మాజీ మంత్రి ఏరాసు ప్రతాప రెడ్డి ఇంటిని ధ్వంసం చేయడంతో ఆయనపై భౌతికదాడికి పాల్పడ్డారు. వివరాలు.. ఆత్మకూరులోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో దివ్యాంగులకు పరికరాల పంపిణీకి సంబంధించి రిజి స్ట్రేషన్ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి హాజరు కావాల్సి ఉంది. ఎంపీ బైరెడ్డి శబరి ఆత్మకూరుకు వస్తుండటంతో మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి ఆత్మకూరులోని తన ఇంటికి ఉదయం అల్పాహారానికి ఆహ్వానించారు. అనంతరం అదే కాలనీలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆమె ఇంటింటి పర్యటన చేపట్టారు.



నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి వాహనాన్ని చుట్టుముటిన టీడీపీ శ్రేణులు



ఏరాసు ఇంటి కిటికీ అద్దాలను ధ్వంసం చేసిన దృశ్యం



మాజీ మంత్రి ఏరాసును ఆయన నివాసంలో ఉంచిన పోలీసులు

ఎమ్మెల్యేకు సమాచారమివ్వకుండా..

'తొలి అడుగు'లో భాగంగా నాలుగైదు ఇళ్ల పర్యటించేలోగా టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు రవీంద్రారెడ్డి, వేణుగోపాల్, నాయకులు శివప్రసాద్‌రెడ్డి, అబ్దుల్లాపురం బాషా, మల్లికార్జునరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, నాగూర్‌ఖాన్, షాబుద్దీన్, వెంకటరావు అక్కడికి చేరుకున్నారు. స్థానికంగా ఉన్న తమకు, ఎమ్మెల్యేకు కనీస సమాచారమివ్వకుండా 'తొలి అడుగు'ను ఎలా నిర్వహిస్తారంటూ ఎంపీని నిలదీశారు. ఇందుకు ఎంపీ శబరి స్పందిస్తూ 'తొలి అడుగు'లో పాల్గొనాలని పార్టీ ఆదేశించిందని, ఎలాగూ ఖాళీగా ఉన్నా కదా అన్నట్లుగా కొన్ని ఇళ్లకైనా పర్యటిద్దామని వెళ్లినట్లు సమాధానం ఇచ్చారు. తాను ఎంపీనని పార్లమెంట్ పరిధిలో ఎక్కడైనా పర్యటించే హక్కు తనకుందని చెప్పుకొచ్చారు. మాటామాటా పెరిగి ఎమ్మెల్యే లేకుండా ఎలా వెళ్తారంటూ టీడీపీ శ్రేణులు ప్రశ్నించడంతో ఆమె తన పర్యటనను మధ్యలో వదిలేసి వెనుదిరిగారు. ఆమె తన వాహనంలోకి ఎక్కి ఎమ్మెల్యే బుడ్డాతో మాట్లాడి జరిగిన విషయాన్ని చెప్పినట్లు తెలిసింది. ఎంపీ శబరి, మాజీ మంత్రి ఏరాసు గోబ్యాక్.. గోబ్యాక్ అంటూ టీడీపీ శ్రేణులు నినాదాలు చేశారు. ఆ తర్వాత అమె అక్కడి నుంచి వెళ్లిపోయారు.

మాజీ మంత్రికి రక్తగాయాలు

ఎంపీ బైరెడ్డి శబరి అక్కడి నుంచి వెళ్లగానే.. అక్కడున్న టీడీపీ శ్రేణులు మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, ఆయన అనుచరులపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో మాజీ మంత్రి ఏరాసుకు చిన్నపాటి రక్తగాయాలయ్యాయి. ఇంటి అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈక్రమంలోనే అర్బన్ సీఐ రాము



గాయాలను చూపుతున్న మాజీ మంత్రి ఏరాసు

వెంటనే మాజీ మంత్రి ఏరాసు, ఆయన అనుచ రులను ఇంట్లోకి పంపించేసి టీడీపీ శ్రేణులను అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ వారు శాంతించలేదు.

మిగతా 8వ పేజీలో

వైద్య పరికరాల కొనుగోలుకు అనుమతి



పర్చేజ్ కమిటీతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సూపరింటెండెంట్ కె. వెంకటేశ్వర్లు వైద్యపరికరాల కొనుగోలు కోసం శుక్రవారం పర్చేజ్ కమిటీతో సమావేశం నిర్వహించారు. రెండు ఆటో క్లియర్ రెండు హీమోడయాలసిస్ యంత్రాలు, ఏఎంసీలో కొత్త ఆక్సిజన్ ప్యానల్ మరమ్మతులు, ఎస్ఎన్‌సీయూలో ఎయిర్ కంప్రెసర్ సర్జికల్ పోస్టు ఆపరేటివ్ విభాగానికి ఫ్లోర్స్ బెడ్స్, రేడియాలజి విభాగానికి డీఆర్ ప్యానెల్‌లు, కంప్యూటర్ సిస్టమ్‌లు కొనుగోలు చేయడానికి పర్చేజ్ కమిటి ఆమోదించింది. సూపరింటెండెంట్ మాట్లాడుతూ రోగులకు మెరుగైన సేవలు అందించడానికి ఈ పరికరాలు ఎంతో దోహదపడుతాయన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, ఎండోక్రైనాలజీ హెచ్‌వోడీలు డా.హరిచరణ్, డా.కే.శ్రీనివాసులు, డా.పి.శ్రీనివాసులు, మెడిసిన్, అనస్థిషియా ప్రొఫెసర్లు డా.లక్ష్మిబాయి, డా.సుధీర్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధుసుబ్రహ్మణ్యం, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డా.పద్మజ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, జూలై 4(ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం సలాంఖాన్ భవన్‌లో ఉద్యోగ, కార్మిక సఘాల రౌండ్‌టేబుల్ సమావేశం ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎండీ అంజిబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు ఈ నెల 7న స్కూటర్ ర్యాలీ, 9న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు బతుకన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి సురేష్ నాయక్, ఏఐయూటీయూసీ జిల్లా కార్యదర్శి ఎం.నాగన్న, ఎల్ఐసీ యూనియన్ నాయకులు సునీయకుమార్, ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకుడు రాయుడు, బీఎస్ఎన్ఎల్ నాయకుడు రమణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి పులగం మద్దిలేటి పాల్గొన్నారు.

బీఈడీ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ బ్యాచ్‌లర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ) రెండో సెమిస్టర్ ఫలితాలను పరీక్షల విభాగం కంట్రోలర్ ఎస్ వెంకటేశ్వర్లు విడుదల చేశారు. శుక్రవారం ఉపకులపతి వి.వెంకట బసరావు ఆదేశాల మేరకు విడుదల చేసిన ఫలితాల్లో 127 మంది పరీక్షలు రాయగా 19 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో 1,3,5వ సెమిస్టర్ ఫలితాలను పరీక్షల విభాగం కంట్రోలర్ ఎస్ వెంకటేశ్వర్లు విడుదల చేశారు. డిసెంబరు 2024 నిర్వహించిన పరీక్షలకు సంబంధించి ఒకంటో సెమిస్టర్‌లో 1673కు 466, 3వ సెమిస్టర్‌లో 2335కు 698, 5వ సెమిస్టర్‌లో 1592 మంది పరీక్షలు రాయగా 425 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు

మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహణపై అవగాహన

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ టౌన్ మోడల్ జూనియర్ కళాశాలలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి డీఐఈవో సురేష్ బాబు హాజరై ప్రసంగించారు. ఈ నెల 10న అన్ని జూనియర్ కళాశాలలో జరగబోయే మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్‌ను విజయవంతం చేసేందుకు కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లాలెప్ప, ఏజీఎంవో సుంకన్న, ఏవో కృష్ణవేణి, కేజీబీవీ ఏపీఆర్‌జేసీ, ఏపీఎస్‌డబ్ల్యూఆర్, మహాత్మా జ్యోతిరావు పూలే కళాశాల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం కావాలి

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 4(ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ విద్యా అమలుకు విద్యార్థులకు పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి మర్రెడ్డి వెంకటరెడ్డి, యూఎస్ఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షుడు తాడికొండ రవి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక బిర్లాగేటులోని జగదీష్ మాల్‌లోని సంఘం కార్యాలయంలో ఉదయ్ కుమార్ అధ్యక్ష తన రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. వెంకటరెడ్డి మాట్లాడుతూ విద్యను కాషాయీకరణ చేసే దిశగా కేంద్రం అడుగులు వేస్తుందన్నారు. రాష్ట్రంలో విద్యను బలోపేతం చేయడంలో కూటమి ప్రభుత్వం విఫల మైందన్నారు. రూ.6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు ఆర్యన్, హరిరెడ్డి, సందీప్, అనిల్, ప్రేమ్ పాల్గొన్నారు.

విలీనంతో సమస్యలు

ఈయూ రాష్ట్ర కార్యదర్శి



ధర్నా చేస్తున్న ఈయూ నాయకులు, ఉద్యోగులు

కర్నూలు రూరల్ జూలై 4(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ సిబ్బందిని గత వైసీపీ ప్రభుత్వం విలీనం చేసిన తర్వాత ఉద్యోగులకు అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఎంపాయిస్ యూనియన్ (ఈయూ) రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, కర్నూలు రీజనల్ కార్యదర్శి ఏవీరెడ్డి, రీజయన్ జాయింట్ కార్యదర్శి కృష్ణార్జునరెడ్డి ఆందోళ వ్యక్తం చేశారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం కర్నూలు-1,2 డిపోల వద్ద ఉద్యోగులు, కార్మికులు ఎర్రబ్యాడ్జీలు ధరించి ధర్నా చేశారు. ముఖ్య అతితులుగా వారు పాల్గొని మాట్లాడారు. గత ఆరేళ్లుగా ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతుల నిలిచిపోయాయని, సిబ్బంది కొరతతో డ్రైవర్లు, కండక్టర్లు, నిత్యం డబుల్ డ్యూటీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలక్ట్రికల్ బస్సులు ఆర్టీసీ కొనుగోలు చేసి నడపాలని డిమాం డ్ చేశారు. కార్యక్ర మంలో కర్నూలు 1 డిపో అధ్యక్షుడు చంద్ర, డిపో కార్యదర్శి ఆర్‌వీఎం రావు, కర్నూలు 2 డిపో కార్యదర్శి మహేశ్వరరావు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం

కర్నూలు స్పోర్ట్స్, జూలై 4(ఆంధ్రజ్యోతి): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా హోంగార్డు కమాండెంట్ మహేశ్వర్ హాజరై ప్రసంగించారు. కఠోర సాధన చేసి లక్ష్యానికి చేరుకోవాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వేణుగోపాల్, జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, ఉపాధ్యక్షులు మునమ్మ, కార్యదర్శి లోకేశ్, ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నేత కొండెపోగు చిన్న సుంకన్న పాల్గొన్నారు.



అశోక్‌నగర్‌లో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి టీజీ భరత్, కల్లూరు 33వ వార్డులో కరపత్రాన్ని అందిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కోడుమూరులో కరపత్రాన్ని అందిస్తున్న కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి

ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు

● రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
● అశోక్‌నగర్‌లో 'తొలి అడుగు'

కర్నూలు అర్బన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ఏడాది పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాయని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం నగరంలోని 45వ వార్డు అశోక్ నగర్‌లో 'తొలి అడుగు' నిర్వహించారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. మహిళలు, వృద్ధులు, విద్యార్థులతో మాట్లాడి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. నగరంలో రోడ్ల వెడల్పు పనులు చెప్పట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. చైతన్య నగర్‌లో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు ప్రహరీ ఏర్పాటు చేస్తామని మంత్రి కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీటీ నాయుడు, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు సంజీవ లక్ష్మి, ధరూర్ జేమ్స్, ముంతాజ్, నాయకులు ఆకెపోగు ప్రభాకర్, కార్పొరేటర్లు మాణిక్యమ్మ, పరమేష్, మాజీ కార్పొరేటర్లు సుంకన్న పాల్గొన్నారు.

నవశకానికి నాందిగా..

కల్లూరు: స్వర్ణాంధ్రలో నవశకానికి నాందిగా కూటమి ప్రభుత్వం ఏడాది పాలన నిలిచిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం 33వ వార్డు పాత కల్లూరులో 'తొలి అడుగు'లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని, కూటమి ఏడాది పాలన ప్రగతిబాటలో సాగుతుందన్నారు. కల్లూరు మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు ఎన్వీ. రామకృష్ణ, రైతుసంఘం అధ్యక్షుడు సంపతి లక్ష్మీరెడ్డి, పాణ్యం మైనారిటీ అధ్యక్షుడు ఎస్.ఫిరోజ్, పవన్ పాల్గొన్నారు.

ఆగస్టు 15 నుంచి మహిళలకు..

కోడుమూరు: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించనుందని కేడీసీసీబీ చైర్మన్ డి.విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. 'తొలి అడుగు'లో భాగంగా శుక్రవారం పట్టణంలోని బీసీ, పెద్ద బోయగేరి, గొల్లవీధిల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా తాగునీటి, సీసీ రోడ్లు, మురికి కాల్వలు, వీధిలైట్ల సమస్యలను ఎవ్వరు పట్టించుకోవడం లేదని మహిళలు పలు సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అందుకు స్పందిస్తూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. జీడీపీ చైర్మన్ కేఈ మల్లికార్జునగౌడ్, టీడీపీ మండల, పట్టణ అధ్యక్షుడు రామక్రిష్ణారెడ్డి, గంగాధర్, నాయకులు గోపాల్‌నాయుడు, బడెసాగౌడ్, కేయి రఘుబాబు, రాముడు, బలరాం, క్రిష్ణ, మునిస్వామి పాల్గొన్నారు.

ప్రగతి పథంలో రాష్ట్రం

గూడూరు: ప్రగతి పథంలో రాష్ట్రం ముందుకు వెళ్తుందని కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి అన్నారు. శుక్రవారం గూడూ రు మండలం ఆర్ కానాపురం గ్రామంలో మండల టీడీపీ అధ్యక్షుడు జె సురేష్ ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగు - ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో భాగంగా స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ మండల అధ్యక్షుడు జె సురేష్, మండల తెలుగు యువత అధ్యక్షుడు సుమన్ బాబు, సర్పంచ్ మునుస్వామి, నాయకులు మన్యం కొండ, కృష్ణ, సుంకిరెడ్డి, ఎల్లప్ప, నరసింహులు, సుభాన్ పాల్గొన్నారు.



ఆర్ కానాపురంలో వృద్ధురాలికి కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి



కాల్వలో 'సుపరిపాలనలో తొలి అడుగు'లో పాల్గొన్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు: కూటమి పాలనలోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. మండలంలోని హుశేనాపురం, కాల్వ గ్రామాల్లో శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు.

కోడుమూరు రూరల్: మండలంలోని చిల్లబండ గ్రామంలో శుక్రవారం టీడీపీ నాయకులు సుపరిపాలనపై ఇంటింటి ప్రచారం నిర్వహించి, ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. బూత్ ఇన్‌చార్జి బాషా, పాఠశాల కమిటీ చైర్మన్ అక్బర్‌బాషా, నాయకులు వలి, సుధాకర్ పాల్గొన్నారు.

సి.బెళగల్: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల కన్వీనర్ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని ఈర్లదిన్నెలో టీడీపీ నాయకులు ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ నాయకులు, అమర్, వెంకటేశ్వరరెడ్డి, శేషన్న పాల్గొన్నారు.

అల్లూరి పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

జడ్పీ సీఈవో నాసరరెడ్డి

కర్నూలు(న్యూసిటీ), జూలై 4: దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని జిల్లా పరిషత్ సీఈవో జి.నాసరరెడ్డి అన్నారు. శుక్రవారం జడ్పీ మినీ సమా వేశ భవనంలో అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జడ్పీ ఈసీవో మాట్లాడుతూ స్వయంపాలన కోసం పోరాడిన అల్లూరి సీతారామరాజు జీవితం నేటి యువతకు ఆదర్శనీయమన్నారు. కార్యక్ర మంలో డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బారెడ్డి, పరిపాలన అధికారులు నాగేంద్రప్రసాద్, సి.మురళీమోహన్‌రెడ్డి, జితేంద్ర, మహ్మద్ హక్, బసవ శేఖర్, భాస్కర్, సి.మురళీమోహన్‌రెడ్డి, ఉద్యోగులు పాల్గొన్నారు.

● నగర పాలక సంస్థ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఆరోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, ఆర్ఓ జునైద్, సూపరింటెండెంట్లు స్వర్ణలత, మంజూర్ బాషా, రామకృష్ణ, సాదిక్, నాగరాజు, నాగన్న పాల్గొన్నారు.

● అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప, సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు లెనిన్‌బాబు, ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి బీసన్నలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, శ్రీకాంత్, అఖిల్, రవి, ప్రభాకర్, ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

● డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప, సహాయ కార్యదర్శి హుస్సేన్‌బాషా పాల్గొన్నారు.

కర్నూలు క్రైం: అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి అడిషనల్ ఎస్పీ హుశేన్‌పీరా పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసి ప్రాణాలర్పించిన యోధుడని కొనియాడారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, ఏఆర్ డీఎస్పీ భాస్కర్‌రావు, కమాండ్ కంట్రోల్ సీఐ శివశంకర్, ఆర్ఐలు జావేద్, నారాయణ, సోమశేఖర్ నాయక్, ఆర్ఎస్‌లు, స్పెషల్ పార్టీ సిబ్బంది, ఏఆర్ పోలీసులు పాల్గొన్నారు.

కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక బీ.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షులు హరీష్ కుమార్ రెడ్డి, జిల్లా కన్వీనర్ మల్లేష్, అధ్యాపకులు రామకృష్ణ, మల్లేష్, బాల శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జడ్పీ సీఈవో నాసరరెడ్డి, అధికారులు



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పోలీసులు

వంగవీటి మోహన రంగా సేవలు చిరస్మరణీయం



వంగవీటి మోహన రంగా చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బలిజ సంఘం నాయకులు

కర్నూలు కల్చరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): దివంగత వంగవీటి మోహనరంగా బడుగు బలహీన వర్గాల పురోభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని నగర బలిజ సంఘం అధ్యక్షుడు గాండ్ల లక్ష్మన్న అన్నారు. శుక్రవారం వంగవీటి మోహనరంగా జయంతి సందర్భంగా నగరంలోని ఐదురోడ్ల కూడలిలోగల హెచ్‌డీసీటీ కాంప్లెక్స్‌లోని నగర బలిజ సంఘం కార్యాలయంలో రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. గాండ్ల లక్ష్మన్న మాట్లాడుతూ రంగా కులమతాలకు అతీతంగా అన్ని వర్గాలకు సేవలు చేశారన్నారు. కార్యక్రమంలో నగర బలిజ సంఘం ప్రధాన కార్యదర్శి మండ్లెం రవికుమార్, కోశాధికారి శైలేష్ భాను, విశ్రాంత ఎస్ఐ ఇ.ప్రకాశ్, నాయకులు అమర్‌నాథ్, శేషు, చింత లపల్లి రామకృష్ణ, మురళి, మంజులాదేవి, డి. ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

● పీ-4 వీడియో కాన్ఫరెన్స్‌లో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో పీ-4 అంశాలపై సీఎం వీడియో కాన్ఫరెన్స్‌కు నియోజకవర్గ చైర్మన్‌గా ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి హాజరయ్యారు. కార్యక్ర మానికి పాణ్యం నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ డిప్యూటీ సీఈఓ ఐవీ సుబ్బారెడ్డి, నాలుగు మండలాల ఎంపీడీఓలు పాల్గొన్నారు. ఆగస్టు 15లోపు బంగారు కుటుంబాలను మార్గదర్శకులను అడాప్ట్ చేయించాలని సీఎం ఆదేశించారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు పాణ్యం నియోజకవర్గంలో 8193 బంగారు కుటుంబాలను గుర్తించారని, 102 మంది మార్గదర్శకులను గుర్తించి 1916 బంగారు కుటుంబాలను అడాప్ట్ చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఐక్య సంఘం అధ్యక్షురాలు బాలభారతి, ఎంపీడీఓలు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాసులు, నాగశేషాచలరెడ్డి పాల్గొన్నారు.

త్యాగానికి ప్రతీకగా మొహర్రం

కల్లూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): త్యాగానికి ప్రతీకగా మొహర్రం జరుపుకుంటారని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు మండలం పుసులూరు గ్రామంలో మొహర్రంను పురస్కరించుకుని పెద్దస్వామి దర్గాలో పీర్లను దర్శించుకుని ఎమ్మెల్యే ప్రార్థనలు చేశారు. గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ ప్రజలు మొహర్రంను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. అనంతరం ముస్లింలు, గ్రామ పెద్దలు ఎమ్మెల్యేకు శాలువ కప్పి సన్మానించారు. పల్లె ప్రభాకర్‌రెడ్డి, కృష్ణ, పాలకొలను సుధాకర్‌రెడ్డి, కల్లూరు అర్బన్ వార్డుల ఇన్‌చార్జి పెరుగు పురుషోత్తం రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్ పాల్గొన్నారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోవాలి: ఎస్పీ

కర్నూలు క్రైం, జూలై 4(ఆంధ్రజ్యోతి): మొహర్రంను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిన్న సరిగెత్తు, పెద్ద సరిగెత్తు వంటి కార్యక్రమాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆయన ఆదేశించారు.

నీటి వనరులను ఆక్రమించుకోరాదు

ఇన్‌చార్జి కలెక్టర్ బి. నవ్య

కర్నూలు కలెక్టరేట్, జూలై 4(ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఆదేశాల మేరకు నీటివనరుల ఆక్రమణలు ఉండకూడదని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ బి. నవ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో నీటివనరులు, చెరువుల ఆక్రమణలకు సంబంధించి జిల్లా స్థాయి వాచ్ డాగ్ కమిటీ సమావేశాన్ని ఇన్‌చార్జి కలెక్టర్ నిర్వహించారు. బి.నవ్య మాట్లాడుతూ ఆదోని, కోసిగి, సి. బెళగల్, కోడుమూరులలో నీటివనరుల ఆక్రమణలను గుర్తించామన్నారు. నీటివనరుల ఆక్రమ ణలపై హైకోర్టులో పిల్ ఉందని, ఇందుకు సంబంధించి ఎప్పటికప్పుడు నివేదిక పంపాలని అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్, మున్సిపాలిటీ, పంచాయతీలలో నీటి వనరులున్న ప్రాంతాల్లో భవన నిర్మా ణాలకు అనుమతులు ఇవ్వకూడదని డీపీవో, మున్సిపల్ కమిషనర్‌లను ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, సర్వే ఏడీ మునికన్నన్, కర్నూలు అర్బన్, రూరల్ తహసీల్దార్లు రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

షాపులపై అధికారుల దాడులు

కోడుమూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఫుడ్ సేఫ్టీ అధికారులు కలిసి పలు రేషన్, ఆయిల్ దుకాణాలు, హోటళ్లపై శుక్రవారం దాడులు నిర్వహించారు. కర్నూలు డీసీటీఓ వెంకటరమణ, మల్లేశ్వరమ్మలతోపాటు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రాజగోపాల్ కలిసి దాడులు చేపట్టారు. ముందుగా పరిశుభ్రత లేని ఆహారాన్ని ప్రజలకు అందిస్తున్నారని పలు హోటళ్లపై దాడులు నిర్వ హించారు. అలాగే పట్టణంలోని మహబూబ్ బాషా రిటైల్ మంచినూనె విక్రయ దుకాణంపై దాడులు నిర్వహించారు. అనంతరం మండలంలోని రేషన్ దుకాణంపై దాడులు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో ఆషాఢ శుద్ధనవమి పూజలు



శివాలయం నుంచి బోనాలు తీసుకువస్తున్న మహిళలు

కర్నూలు కల్చరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఆషాఢ శుద్ధనవమి సందర్భంగా శుక్రవారం నగరంలోని వివిధ ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరంలో కేసీ కెనాల్ సమీపంలోని సప్తగిరినగర్‌లోగల అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో చౌడేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారికి సుప్రభాత సేవ, పంచామృ తాభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి మూలమూర్తికి వివిధ రకాల కూరగాయలతో అలంకరణ చేశారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు, లలితా సహస్రనామ పఠనాలు, పారాయణం చేశారు. అంతకు ముందు ఆలయంలోని శివాలయం నుంచి మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయ కమిటీ కార్యదర్శి మల్లికార్జున రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

● **లలితా పీఠంలో..** పాతనగరంలో జమ్మిచెట్టు సమీపంలోని లలితా పీఠంలో ఆషాఢ శుద్ధ నవమిని పురస్కరించుకొని వేకువ జాము నుంచి లలితాదేవి అమ్మవారికి, వారాహిదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, మహా మంగళహారతులు నిర్వహించారు. అమ్మవారికి చీరె సారె సమర్పించారు. అనంతరం మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.

నేటి నుంచి ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు అగ్రికల్చర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇంకా 4వేల మంది రైతుల దాకా వివిధ కారణాల వల్ల 'అన్నదాత సుఖీభవ' అనర్హుల జాబితాలో చేరిపోయారు. వీరిని కూడా అర్హుల జాబితాలో చేర్చేందుకు ప్రభుత్వం మరో అవకాశాన్ని రైతులకు అందించేందుకు నిర్ణయించింది. ఇందులో భాగంగా శనివారం నుంచి అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత కోల్పోయిన రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేసింది. వివిద కారణాల వల ఈ పథకం కింద అర్హత సాధించని రైతులు రైతుసేవా కేంద్రాలకు వెళ్లి పిర్యాదు చేయాలని, పూర్తి వివరాలతో ఆకేంద్రాల్లోని అధికారులకు దరఖాస్తు ఇవ్వాలని కర్నూలు వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి తెలిపారు.

అధిక దిగుబడి సాధించేందుకు..

కర్నూలు అగ్రికల్చర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సాగులో తగిన మెలకువలు పాటించకపోవడం వల్ల అధిక దిగుబడులను పొందలేకపోతున్నారని కర్నూలు ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ రత్న ప్రసాద్ తెలిపారు. వారికి సరైన అవగాహన కల్పించడం వల్ల తక్షణమే అధిక దిగుబడిని సాధించేందుకు అవసరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని ఇందులో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 184 వ్యవసాయ ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు రత్నప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమాలు రెగ్యులర్ ఏడీఏల ద్వారా నిర్వహిస్తామని, ఒక్కో ప్రదర్శన క్షేత్రానికి 4వేల ప్రకారం 184 ప్రదర్శన క్షేత్రాలకు రూ.7.33 లక్షలు ఏడీఏలకు పంపిణీ చేశామని స్పష్టం చేశారు. కర్నూలు, ఆదోని సబ్ డివిజన్‌లలో 18, ఎమ్మిగనూరు, పత్తికొండ సబ్ డివిజన్‌లలో 17, డోన్, నందికొట్కూరు, ఆత్మకూరు, నంద్యాల, ఆళ్లగడ్డ, కోయలకుంట్ల సబ్‌డివిజన్‌లలో 16 వంతున ఈ వ్యవసాయ ప్రదర్శన క్షేత్రాలను రైతుల పొలాల్లోనే నిర్వహిస్తామన్నారు.

నలుగురికి సీహెచ్‌వోలుగా పదోన్నతులు

కర్నూలు హాస్పిటల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): వైద్యఆరోగ్యశాఖలోని ఉమ్మడి జిల్లాలో పని చేస్తున్న నలుగురు ఫీమేల్ పీహెచ్ఎన్ (నాన్ టీచింగ్)లకు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (గెజిటెడ్)గా పదోన్నతి పొందారు. శుక్రవారం వైద్యఆరోగ్యశాఖ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డా.కె.పద్మావతి విజయవాడ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 42 మంది పీహెచ్ఎన్ (ఎన్‌టీ)లకు సీహెచ్‌వోలుగా పదోన్నతి కల్పించి పోస్టింగులు వేశారు. ఎన్.మాధవి, బండి ఆత్మకూరు పీహెచ్‌సీ నుంచి ఎంసీహెచ్ సెంటర్ గడియారం హాస్పిటల్ కర్నూలుకు, కే.దామోదరమ్మ కమ్మరచెడు పీహెచ్‌సీ నుంచి దైవందిన్నె పీహెచ్‌సీకి, కే.విజయలక్ష్మి హుశేనాపురం పీహెచ్‌సీ నుంచి గోస్పాడు పీహెచ్‌సీ, పి.లక్ష్మీదేవి డొర్నిపాడు పీహెచ్‌సీ నుంచి రేవనూరు పీహెచ్‌సీకి కోరుకున్నారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉంది.

ఆటో, ద్విచక్ర వాహనం ఢీ: ముగ్గురికి గాయాలు



ఆటో నుంచి ప్రయాణికులను బయటకు తీస్తున్న స్థానికులు

ఆలూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఆలూరు-బళ్లారి మార్గంలో అగ్రహారం వైపు వెళ్తున్న వీరేష్, బళ్లారి నుంచి కమ్మరచేడు వైపుకు వెళ్తున్న ఆటో, ద్విచక్రవాహనం శుక్రవారం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, రడైవర్ నవీన్ కూడా గాయపడ్డాడు. ఆటోలో ప్రయాణికులు ఇరుక్కోవడంతో జనం వారిని బయటకు తీసేందుకు ఇబ్బంది పడ్డారు. అలాగే ద్విచక్రవాహనంలో వెళ్తున్న వీరేష్‌కు కూడా గాయాలు కావడంతో అంబులెన్స్‌లో ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలంచారు. ఆటో డ్రైవర్ నవీన్‌ను బళ్లారి ఆసుపత్రికి వైద్యులు రెఫర్ చేయగా, గాయపడిన వీరేష్‌ను ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జిగా జె.లక్ష్మీనరసింహ యాదవ్



కర్నూలు అర్బన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిగా ఏఐసీసీ సభ్యుడు జంగిటి లక్ష్మీ నరసింహ యాదవ్ నియమిస్తూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్. షర్మిల ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం పీసీసీ కార్యాలయం నుంచి జిల్లా కార్యాలయానికి ఈ మేరకు ఉత్తర్వులు అందాయి. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిని నియమించే వరకు ఆయన ఇన్‌చార్జి హోదాలో ఉంటారని తెలిపారు.

నిందితుల అరెస్టు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రవీణ్‌కుమార్

బనగానపల్లె, జూలై 4, (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలో గత ఫిబ్రవరి నెలలో జరిగిన దొంగతనం కేసులో ఇద్దరు దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ దుగ్గిరెడ్డి శుక్రవారం తెలిపారు. బనగానపల్లె పట్టణంలోని కొండపేటలో కాటసాని బలరామిరెడ్డి ఇంట్లో జరిగిన చోరీలో కడపజిల్లా కాజీపేట మండలం తుడుములదిన్నె గ్రామానికి చెందిన కూకట్‌పల్లి భరత్‌కుమార్, అనంతపురం జిల్లా గుత్తి మండలం మారుతీనగర్‌కు చెందిన మహేశ్ రూ. 7.50 లక్షల విలువగల 20 తులాల బంగారును దొంగిలించారు. దీనిపై కాటసాని బలరామిరెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్ఐ దుగ్గిరెడ్డి ఆధ్వర్యంలో క్రైంపార్టీ సిబ్బంది భరత్‌కుమార్, మహేశ్‌లను అరెస్టు చేసి వారి వద్ద 20 తులాల బంగారు, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసులో కానిస్టేబుళ్లు సుబ్బరామకృష్ణ, నాగన్న, ప్రదీప్‌లను ఎస్పీ అభినందించారు.

స్కూల్ బస్సు కిందపడి విద్యార్థిని మృతి



హరిప్రియ (ఫైల్)

ఆళ్లగడ్డ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సు కింద పడి ఓ విద్యార్థిని మృతి చెందింది. ఈ హృదయ విదారక ఘటన పట్టణంలో ఎంవీనగర్ కాలనీలో చోటుచేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. కాలనీలోని శ్రీకీర్తన పాఠశాలలో హరిప్రియ(4)ను తల్లిదండ్రులు శ్రీధర్, వనజ శుక్రవారం ఉదయం నర్సరీలో చేర్పించారు. పాఠశాల ముగిసిన అనంతరం బస్సు దిగి ఇంటికి వెళ్తుండగా డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సు నడిపాడు. హరిప్రియ బస్సు టైర్ల కిందపడి అక్కడికక్కడే మృతిచెందింది. పాఠశాలలో చేరిన రోజే చిన్నారి మృత్యువాత పడటంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటా యి. సంఘటన జరిగిన వెంటనే బస్సు డ్రైవర్ పరారయ్యాడు. విషయం తెలిసిన వెంటనే పట్టణ సీఐ యుగంధర్, ఎస్ఐ నగీనా, సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కోసిగి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కోసిగికి రెండు కిలోమీటర్ల సమీపంలోని ఆదోని రోడ్డులో శుక్రవారం రాత్రి జరిగిన ట్రాక్టర్, బైక్ ఢీకొన్న ప్రమాదంలో మండల పరిధిలోని జంపాపురం గ్రామానికి చెందిన చెన్నబసవరెడ్డి (25) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కోసిగి ఎస్ఐ హనుమంతరెడ్డి తెలిపిన వివరాలివీ.. జంపాపురం గ్రామానికి చెందిన చెన్నబసవరెడ్డి పెద్దకడుబూరు మండలం బాపురం గ్రామానికి బైక్‌పై బసవరాజుతో కలిసి వెళ్తుండగా.. ఆదోని నుంచి సర్వీసు బండరాళ్ల లోడుతో కోసిగి వైపు వస్తున్న ట్రాక్టర్ వీరి బైక్‌ను ఎదురెదురుగా ఢీకొనడంతో చెన్నబసవరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. యువకుడికి భార్య గంగోత్రి ఉన్నారు. చెన్నబసవరెడ్డి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమ్మితం ఆదోని ఏరియాసుపత్రికి తరలించారు.

ఆలూరులో అయోమయం..!

- ఇన్‌చార్జి, సీనియర్ నాయకులు లేకుండానే 'తొలి అడుగు'
- ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్లుగా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల,ఎంపీ నాగరాజు, పరిశీలకుడు నాగరాజు

కర్నూలు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కేడర్ బలంగా ఉన్న ఆలూరు నియోజకవర్గంలో ఏం జరుగుతోందో తెలియక ఆ పార్టీ కార్యకర్తల్లో అయోమయం నెలకొంది. నియోజకవర్గం ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్, సీనియర్ నాయకులు లేకుండానే శుక్రవారం నియోజకవర్గంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాలను టీడీపీ ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్లు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పార్టీ పరిశీలకుడు, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డిలు దేవనకొండ, చిప్పగిరి మండలాల్లో నిర్వహించడం రాజకీయ చర్చకు తెరలేచింది. నియోజకవర్గం తెలుగు తమ్ముళ్లలో ఏ ఇద్దరు కలసినా ఇదే చర్చ. కీలక నేతలు లేకుండా పార్టీ కార్యక్రమాలు నిర్వహించడం ఎంతవరకు సమంజసం అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇది దేనికి సంకేతమని పేర్కొంటున్నారు.

తారస్థాయికి..

ఆలూరు నియోజకవర్గం టీడీపీలో వర్గవిభేదాలు తార స్థాయికి చేరుకున్నాయి. రాష్ట్ర విభజన తరువాత 2014లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా వీరభద్ర గౌడ్ పోటీ చేసి మూడు వేల ఓట్ల స్వల్ప తేడాతో ఓటమి చెందాడు. పార్టీ అధికారంలోకి రావడంతో పార్టీ ఇన్‌చార్జిగా కొనసాగారు. 2019 ఎన్నికల్లో బి.వీరభద్రగౌడ్‌ను కాదని, ఆ ఎన్నికల ముందే టీడీపీలో చేరిన కోట్ల సుజాతమ్మకు అధినేత చంద్రబాబు టికెట్ ఇచ్చారు. ఆమె కూడా ఓటమి చెందారు. టీడీపీ క్యాడర్ బలంగా ఉన్నా పార్టీ నేతల్లో వర్గవిభేదాలతో రెండు పర్యాయాలు టీడీపీ ఓటమి చెందిందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. వైసీపీ హయాంలో టీడీపీ ఇన్‌చార్జిగా కోట్ల సుజాతమ్మ ఉంటూ యువగళం పేరిట యువనేత నారా లోకేశ్ చేపట్టిన పాదయాత్ర, అధినేత చంద్రబాబు నిర్వహించిన బాదుడే బాదుడు కార్యక్రమాలు చేపట్టారు. 2024 ఎన్నికలకు ముందు మళ్లీ టీడీపీలో వర్గవిభేదాలు తీవ్రస్థాయికి చేరాయి. కోట్ల సుజాతమ్మకు కాకుండా తమలో ఒకరికి టికెట్ ఇవ్వాలంటూ పార్టీ నేతలు వీరభద్రగౌడ్, వైకుంఠం మల్లికార్జున, కప్పట్రాళ్ల బొజ్జమ్మ జట్టుకట్టారు. రాజకీయ సమీకరణాల దృష్ట్యా కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డికి డోన్ టికెట్ ఇవ్వడంతో, వీరభద్రగౌడ్‌ను అధిష్ఠానం ఆలూరు నుంచి బరిలో దింపింది. టికెట్ కోసం జట్టు కట్టిన నాయకుల మధ్య విభేదాలు మళ్లీ మొదలయ్యాయి. రాష్ట్రంలో కూటమి విజయ సునామీ సృష్టిస్తే ఆలూరులో మాత్రం టీడీపీ ఓడిపోవాల్సి వచ్చింది.

'తొలి అడుగు'లో వారేరీ..?

సమన్వయంతో ముందుకు వెళ్లాల్సిన నాయకులు విభేదాల్లో హద్దులు దాటుతున్నారు. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందిన వీరభద్రగౌడే టీడీపీ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. ఆయన నాయకత్వాన్ని పార్టీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి వైకుంఠం ప్రసాద్, గత ఎన్నికల్లో టికెట్ కోసం ప్రయత్నించిన వైకుంఠం జ్యోతి, ఎన్నికల ముందు వైసీపీ టికెట్ ఆశించి భంగపడి, తిరిగి టీడీపీలో చేరిన కప్పట్రాళ్ల బొజ్జమ్మ సహా ఆలూరు, ఆస్పరి, హొళగుంద మండలాలకు చెందిన పలువురు టీడీపీ నాయకులు, వైకుంఠం వర్గీయులు ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ నాయకత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. త్వరలో తమకు ఇన్‌చార్జి బాధ్యతలు కూడా వస్తాయని వైకుంఠం ప్రసాద్, జ్యోతి దంపతులు బాహాటంగానే చెబుతున్నారు. వీరభద్రగౌడ్, వైకుంఠం వర్గాల మధ్య విభేదాలతో పార్టీ కార్యకర్తలు సైలెంట్ అవుతున్నారు. ఈ పరిస్థితుల్లో నాయకుల మధ్య సమన్వయం చేసి పార్టీ కార్యక్రమాలను సమష్టిగా నిర్వహించేలా అధిష్ఠానం జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ బస్తిపాటి నాగరాజు, నియోజకవర్గం పరిశీలకుడు పూల నాగరాజును ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్లుగా నియమించింది. 'తొలి అడుగు'ను దేవనకొండ, చిప్పగిరి మండలాల్లో పి. తిక్కారెడ్డి, బస్తిపాటి నాగరాజు, పూల నాగరాజు, కప్పట్రాళ్ల బొజ్జమ్మ నిర్వహించడం టీడీపీ శ్రేణులను అయోమయానికి గురి చేస్తుంది. ఆలూరు నియోజకవర్గానికి టీడీపీ ఇన్‌చార్జి ఉన్నట్లా.. లేనట్లా..? అంటూ పలువురు చర్చించుకుంటున్నారు.



ఇన్‌చార్జి లేకుండానే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తున్న ఎంపీ, తదితరులు

జగన్‌కు పాదయాత్ర చేసే అర్హత లేదు: మంత్రి బీసీ

కొలిమిగుండ్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి రాష్ట్రంలో పాదయాత్ర చేసే అర్హత లేదని రాష్ట్ర రోడ్లు, భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం 'తొలి అడుగు'లో భాగంగా మండలకేంద్రమైన కొలిమిగుండ్లలో మంత్రి బీసీ పర్యటించారు. ఈసందర్భంగా రూ.40లక్షలతో శాంతినగర్‌లో నూతన ంగా నిర్మించిన సీసీ రోడ్డును మంత్రి ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో 'అమ్మ ఒడి' ఇంట్లో ఇద్దరు పిల్లలకు ఇస్తామని మాటతప్పి ఒక్కరికే ఇచ్చారని ఎద్దేవా చేశారు. ఇచ్చిన ప్రతి హామీని నిలుపుకునే నాయకుడు చంద్రబాబు నాయుడని మంత్రి అన్నారు. 'తల్లికి వందనం' అమలుతో అక్కాచెల్లమ్మల మొహల్లో ఆనందం కనిపిస్తోందన్నారు. శాంతి నగర్‌లోని కాలనీల్లో పర్యటించి, ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును మహిళలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆయాశాఖల అధికారులతో పాటు, టీడీపీ నాయకులు మూలే రామేశ్వర రెడ్డి, కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, నంద్యాల రామేశ్వర్‌రెడ్డి, అంబటి జయలక్ష్మీ రెడ్డి, హుస్సేన్‌రెడ్డి, రవిప్రకాశ్‌రెడ్డి, పోతిరెడ్డి రాఘవరెడ్డి, ప్రసాద్, వివేక్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి బీసీ జనార్దనరెడ్డి

ఎర్రబోతులపై మంత్రి ఆగ్రహం

జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిపై మంత్రి బీసీ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఐదేళ్లు అధికారంలో ఉండి, జడ్పీ చైర్మన్ హోదా పెట్టుకొని ఆయన కార్యాలయం ముందు రోడ్డు వేయించలేకపోయారని విమర్శించారు. ఎర్రబోతుల సొంత పంచాయతీ పేట్నీకోటలో అభివృద్ధి పనులను అడ్డుకుంటున్నారని, మీరు అడ్డుపడినా అభివృద్ధి ఆగదంటూ మంత్రి బీసీ హెచ్చరించారు.

విందులపైనే ధ్యాస..!

- రైతులను గాలికొదిలేసిన వ్యవసాయాధికారులు
- ఆర్‌బీకే భవనంలో డీలర్ల విందు
- వ్యవసాయ కార్యాలయానికి తాళం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

ఓర్వకల్లు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాధికారులకు విందులపై ఉన్న ధ్యాస.. రైతులపై లేదనేది స్పష్టమవుతోంది. పంటల సాగులో అవసరమైన సలహాలు, సూచనలు ఇచ్చి ఆదుకోవాల్సిన వ్యవసాయాధికారులు విందులో మునిగిపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓర్వకల్లులోని ఆర్‌బీకే కేంద్రంలో శుక్రవారం ఫర్టిలైజర్స్ షాపు యజమానులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫర్టిలైజర్స్ షాపు యజమానులు అధికారులకు విందు ఏర్పాటుచేశారు. ఈ విందుకు వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి, కర్నూలు ఏడీఏ శాలురెడ్డి, ఏవో మధుమతి హాజరయ్యారు. సమావేశానికి హాజరైన అధికారులు రైతుల సమస్యలపై ఏమీ చర్చించకుండా డీలర్లు పెట్టిన విందులో పాల్గొని అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీనిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



ఆర్‌బీకే కేంద్రంలో విందు భోజనం చేస్తున్న డీలర్లు



ఓర్వకల్లులో వ్యవసాయ కార్యాలయానికి తాళం వేసిన దృశ్యం

అలా కాకుండా ఆర్‌బీకే భవనంలో డీలర్లు సమకూర్చిన విందు భోజనాన్ని ఆరగించి వారు చేస్తున్న అక్రమాలను కప్పిపుచ్చే ప్రయత్నాలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఏ మాత్రం తనిఖీలు చేయకుండా రైతుల సమస్యలు తెలుసుకోకుండా అధికారులు వెనుదిరగడంపై నిరసన వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు అవసరమైన ఎరువులు..

రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు డీలర్ల వద్ద ఉన్నాయో లేదో తెలపాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

ఆర్‌బీకేలో సమావేశం..

ఆర్‌బీకేలో సమావేశం నిర్వహించడం, వ్యవసాయ కార్యాలయానికి తాళం వేయడంతో రైతులు ఆకార్యాలయానికి వచ్చి వెనుదిరిగిపోయారు. జిల్లా వ్యాప్తంగా నకిలీ ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలు విచ్చలవిడిగా డీలర్లు విక్రయిస్తున్నా ఈ సందర్భాల్లో డీలర్లు పెట్టిన విందు భోజనంలో జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొనడంపై ఏమిటని రైతులు చర్చించుకుంటున్నారు. ఈ విషయంపై జిల్లా అధికారులు స్పందించాల్సిన అవసరం ఉందని రైతులు అంటున్నారు.

జైలు తనిఖీ

కర్నూలు లీగల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక పంచలింగాలలోని జిల్లా జైలును, నగరంలోని మహిళా జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లీనిక్‌ల గురించి వివరిస్తూ ఈ క్లీనిక్‌లలో ఒక న్యాయవాది, పారా లీగల్ వలంటీర్ సభ్యులుగా ఉంటారని, వారి ద్వారా ఖైదీలు న్యాయ సహాయాన్ని పొందవచ్చని ఆయన తెలిపారు. జైలులో ఉన్న ఖైదీలు సత్ ప్రవర్తన అలవర్చుకుని శిక్షణ పూర్తి చేసుకోవాలని కోరారు. ఆ తర్వాత ఆయన ఖైదీలకు అందించే భోజనం, రేషన్, ఆరోగ్య సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు.

యువకుడి ఆత్మహత్య

బండిఆత్మకూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈర్నపాడు గ్రామంలో సుదర్శన్ (27) అనే యువకుడు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ జగన్మోహన్ తెలిపిన వివరాలివీ.. సుదర్శన్ అనారోగ్యంతో శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. యువకుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 8 మందికి జరిమానా

- చెల్లించని పక్షంలో 7 రోజుల జైలుశిక్ష

పత్తికొండ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులలో పత్తికొండ జూనియర్ సివిల్ న్యాయాధికారి టి. జోత్స్నాదేవి 8 మందికి రూ.10వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో 7రోజులు సాధారణ జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. రూరల్ సీఐ పులిశేఖర్ తెలిపిన వివరాల మేరకు.. పత్తికొండ సర్కిల్ పరిధిలోని జొన్నగిరి పోలీస్‌స్టేషన్‌లో ఏడుగురు, మద్దికెర పోలీస్‌స్టేషన్‌లో ఒకరు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయన్నారు. శుక్రవారం ఈ కేసులను విచారించిన జడ్జి పైతీర్పును ఇచ్చారన్నారు. జరిమానా చెల్లించని పక్షంలో వారిని జైలుకు తరలిస్తామన్నారు..

చిరుద్యోగిపై జూనియర్ అసిస్టెంట్ దాడి

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వైనం



ఆర్టీఓ ఏజెంట్ మస్తాన్‌తో గొడవ పడుతున్న జూనియర్ అసిస్టెంట్ మనోహర్

ఆదోని, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఆర్టీవో ఏజెంట్ వద్ద చిరుద్యోగిగా పనిచేస్తున్న వ్యక్తిపై ఆదోని ఆర్టీవో కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన ఆలస్యంలో వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాలు.. పట్టణంలోని ఓవర్ బ్రిడ్జి కింద ఆర్టీవో ఏజెంట్‌గా ఉన్న మస్తాన్ ఆఫీసుకు జూన్ 30వ తేదీన జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మనోహర్ వెళ్లాడు. మస్తాన్ కార్యాలయంలో ఉన్న ఆఫీసు బాయ్ అల్తాఫ్‌ను ఎందుకు తనపై దుష్ప్రచారం చేస్తున్నావంటూ నిలదీశాడు. ఆర్టీవో కార్యాలయంలో మామూళ్లు తీసుకున్నట్లు చూశావా అంటూ నిలదీశాడు. అంతటితో ఆగకుండా ఆఫీసు బాయ్ అల్తాఫ్ పై దాడి చేశారు. అక్కడే లారీ అసోసియేషన్ సభ్యులు వారిద్దరికి నచ్చజెప్పి పంపించారు. ఈ విషయంపై మస్తాన్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. మనోహర్ ఆఫీసుకు వచ్చి అల్తాఫ్‌పై చేయి చేసుకున్నది వాస్తవమేనని అన్నారు.

రేపు జానపద సంగీత విభావరి

కర్నూలు కల్చరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో వారం వారం కళా ప్రదర్శనల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు జానపద సంగీత విభావరి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు కళారత్న పత్తి ఓబులయ్య, ప్రధాన కార్యదర్శి ఎస్ మహ్మద్ మియా ఒక ప్రకటనలో తెలిపారు. యూట్యూబ్ ఛానెళ్లలో పేరొందిన గాయకులతో ఈ పాటల కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఆలూరి రాజా (హైదరాబాదు), వై. గంగాధర్ (నిర్వహణ, సంగీతం), అఖిల (సింగర్, హైదరాబాదు), నరసింహులు (సింగర్), మహేందర్ (సింగర్, ప్రొద్దుటూరు), విష్ణు (సింగర్, హైదరాబాదు)లతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

దంచికొట్టింది..

కోసిగి మండలంలో శుక్రవారం సాయంత్రం వర్షం దంచికొట్టింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. సుమారు గంటసేపు ఏకధాటిగా వాన కురవడంతో ఉరుకుంద రోడ్డులోని చాపవంక వాగుకు వరద పోటెత్తింది. దీంతో రెండు గంటల పాటు వాహనదారులు ఇటు, అటూ వైపు నిలిచిపోయారు. వందల సంఖ్యలో వాహనాలు రోడ్లపైనే నిలిచిపోయి ఇబ్బందులు పడ్డారు. ఆర్టీసీ బస్టాండ్ భారీవర్షానికి జలమయమై చెరువును తలపించింది. భారీ వర్షం పడటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● కోసిగి, ఆంధ్రజ్యోతి



ప్రమాదకరంగా చాపవంక వాగును దాటుతున్న వాహనదారులు, ప్రజలు



ఉధృతంగా ప్రవహిస్తున్న చాపవంక వాగు



భారీ వర్షానికి జలమయమైన ఆర్టీసీ బస్టాండు

సుపరిపాలనతో ప్రజలు సురక్షితం

● ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి



కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్ టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనతో ప్రజలు సురక్షితంగా ఉన్నా రని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. శుక్రవా రం సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని పట్టణంలోని 25వ వార్డు జంగాల కాలనీలో, రాజా థియేటర్ వెనుకాల ఇంటింటికి తిరుగుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. కాలనీవాసుల ఎమ్మెల్యేకు పలు వినతులు ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్, డీఈ రఘు, ఏఈ సురేష్, న్యాయవాది ఆంజనేయులు గౌడు, నాయకులు పాల్గొన్నారు.

ప్యాపిలి: పేదరిక నిర్మూలనే సీఎం చంద్రబాబు ధ్యేయమని డీసీఎంఎస్ చైర్మన్ వై నాగేశ్వరరావుయాదవ్ అన్నారు. శుక్రవా రం మండలంలోని చంద్రపల్లి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి

- ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

ఆళ్లగడ్డ, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆరు మండలాల అధికారులతో పీడీ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర విజన్- 2047పై సమీక్షా నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో నూర్జహాన్, తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, వివిధ మండలాల అధికారులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న విజన్ 2047 సమీక్షా సమావేశానికి రాని పలు శాఖల అధికారులపై ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా శాఖల అధికారులపై చర్యలు తీసుకోవాలని పీడీని ఆదేశించారు.

చాగలమర్రి: రాష్ట్రంలో టీడీపీతోనే సుపరిపాలన సాధ్యమని ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ అన్నా రు. శుక్రవారం మండలంలోని చిన్న బోధ నంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం లో పాల్గొన్నారు. రూ.33 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, టీడీపీ నాయకులు రమణారెడ్డి, శజ్జారెడ్డి, కొలిమి ఉసేన్‌వలి, మౌళాలి, పుల్లయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, రామిరెడ్డి, నాగరాజు, సంజీవరెడ్డి, గోపాల్, వెంకటేష్, కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆర్. వెంకట రమణ

డోన్ టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆర్. వెంకట రమణ తెలిపారు. శుక్రవారం ఫ్రైడే- డ్రైడే కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని శ్రీనివాసనగర్, గాంధీనగర్ ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడుతో కలిసి ఆయన పరిశీలించారు. ప్రజలను పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి తొట్టీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచనలు చేశారు. అలాగే పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని పాతపేటలో డెంగీ కేసులను తనిఖీ చేశారు. పీహెచ్‌సీలలోని ఓపీ విభాగంలో రోగులకు, వారికి అందుతున్న వైద్యసేవలు, చికిత్సలు, మందులు వారి పట్ల వైద్యులు, ఆరోగ్యసిబ్బంది ఎలా వ్యవహరిస్తున్నారని పరిశీలించారు. ఓపీ విభాగంలోని రికార్డులను, రిపోర్టులను తనిఖీ చేశారు. వైద్యాధికారులకు, సచివాలయ ఆరోగ్య కార్యకర్తలకు, ఆశా కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ సత్యనారాయణ, అర్బన్ హెల్త్ సెంటర్ డా. బాలాజీ మహర్షి, సబ్ యూనిట్ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ మధుసూదన్‌రావు, ఆనంద్‌రావు, నరసింహులు, ఏఎన్ఎం సుజాత, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

చాగలమర్రి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని వాసవీ డిగ్రీ కళాశాలలో శనివారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ షాబుద్దీన్ తెలిపారు. శుక్రవారం జాబ్‌మేళా కరపత్రాలను విడుదల చేశారు. నిరుద్యోగ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు. కళాశాల కరస్పాండెంట్ రఘురామ్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ మహేశ్వరయ్య, కంపెనీ ఆర్గనైజర్ నితిన్ పాల్గొన్నారు.

పాడిపరిశ్రమ అభివృద్ధే లక్ష్యం

చాగలమర్రి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పాడిపరిశ్రమ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఆళ్లగడ్డ డివిజన్ పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య అన్నారు. శుక్రవారం శెట్టివీడు గ్రామంలో నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, పశువైద్యాధికారి రవింద్రారెడ్డి, పశువైద్య సిబ్బంది షజి, సాహిద, రైతులు పాల్గొన్నారు.

నేడు డీపీఆర్‌సీలో శిక్షణ

కర్నూలు న్యూసిటీ, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఐఆర్‌డీ అండ్ పీఆర్ కమిషనర్ ఆదేశాల మేరకు ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కేంద్రం ప్రిన్సిపాల్ జి. నాసరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం(డీపీఆర్‌సీ)లో శనివారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో పంచాయతీ అడ్వాన్స్ ఇండెక్స్ గ్రామస్థాయిలోని సామాజిక, ఆర్థిక ప్రగతిని తెలియజేసే సూచికల గురించి అవగాహన కల్పిస్తారని అన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా స్థాయి సంబంధిత అధికారులు ప్రతి మండలం నుంచి ఎంపీడీఓ, ఒక పంచాయతీ కార్యదర్శి, కంప్యూటర్ ఆపరేటర్ హాజరయ్యేలా ఆదేశాలు జారీ చేయాలని పేర్కొన్నారు.

ఫతేహాలు సమర్పించిన మంత్రులు



పీర్లను దర్శించుకున్న మంత్రులు ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, జూలై 4(ఆంధ్రజ్యోతి): మొహర్రం సందర్భంగా మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్ఎండి ఫరూక్ శుక్రవారం రాత్రి 8 గంటలకు ఆస్థానంలోని పీర్లకు ఫతేహాలు సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. సంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు మం త్రులు వెల్లడించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా సుదర్శన జయంతి



స్వామికి పూజ చేస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ, జూలై 4(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో శుక్రవారం సుదర్శన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేవస్థాన ప్రధాన అర్చకులు కీడాంబి వేణుగోపాలన్ స్వామి ఆధ్వర్యంలో శ్రీ ప్రహ్లాద వరద స్వామి శ్రీదేవి భూదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేష తిరుమంజనం, అభిషేకం నిర్వహించారు.

ఉపాధి సిబ్బందిపై వేటు

కొలిమిగుండ్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : విధులను విస్మరించి మందు పార్టీతో హల్‌చల్ చేసిన ఉపాధి సిబ్బందిపై ఉన్నతాధికారులు సస్పెండ్ చేస్తూ వేటు వేశారు. ఈమేరకు జిల్లా ఉపాధి కార్యాలయం నుంచి శుక్రవారం ఆదేశాలు వచ్చినట్లు ఎంపీడీవో ప్రసాదరెడ్డి వెల్లడించారు. ఈసీ చిన్నరంగయ్య, టీఏ రంగస్వామి, కంప్యూటర్ ఆపరేటర్లు పెద్దయ్య, నరేష్, ఫీల్డ్ అసిస్టెంట్ మాబు, నాగేశ్వరరెడ్డిలను విధుల నుంచి తప్పించారు.

తొలి అడుగులో ఉద్రిక్తత..!

(5వ పేజీ తరువాయి)

శ్రీశైల నియోజకవర్గం టీడీపీలో మాజీ మంత్రి ఏరాసు వర్గపోరును ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. ఆ తర్వాత అక్కడికి ఆత్మకూరు డీఎస్పీ రామాంజీనాయక్, రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి చేరుకుని అక్కడున్న వారిని చెదరగొట్టారు. ఆ వెంటనే ఏరాసును పోలీసులు బందోబస్తు నడుమ నంద్యాలకు తరలించారు.

ఎంపీడీవో కార్యాలయం వద్ద..

ఆత్మకూరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించిన ఎంపీ బైరెడ్డి శబరిని ఎంపీడీవో కార్యాలయంలో జరిగే దివ్యాంగులకు పరికరాల పంపిణీకి సంబం ధించిన రిజిస్ట్రేషన్ కార్యక్రమానికి కూడా అడ్డుకునేందుకు టీడీపీ శ్రేణులు ప్రయత్నించారు. కొంతమంది మహిళా కార్యకర్తలతో కలిసి అక్కడికి భారీగా చేరుకున్నారు. ఈక్రమంలోనే అక్కడ జరిగే అధికారుల ప్రసంగాలను త్వరిగితన ముగించేసి సమావేశాన్ని పూర్తిచేసినట్లు తెలిసింది. బీజేపీ నాయకులు మోమిన్ షబానా ఎంపీ శబరిని మధ్యాహ్న భోజనానికి ఆహ్వానించడంతో ఆమె అక్కడికి వెళ్లారు. దీంతో చివరకు పోలీసులు ఎంపీ శబరి నచ్చజెప్పడంతో ఆమె నంద్యాలకు వెళ్లిపోయారు. ఒకానొక సమయంలో శబరిని అడ్డుకున్నారన్న విషయం తెలుసుకున్న పాములపాడు, కొత్తపల్లి మండలాలకు చెందిన ఆమె అనుచరులు ఆత్మకూరుకు వచ్చే ప్రయత్నం చేశారు. వారికి పోలీసులు సర్ధిచెప్పినట్లు సమాచారం. ఏదిఏమైనా 'తొలి అడుగు'తో ఆత్మకూరులో టెన్షన్ వాతావరణం నెలకొంది.



దాడి అనంతరం మాజీ మంత్రి ఏరాసును నంద్యాలకు పంపిస్తున్న పోలీసులు

అపార్థం వల్లే సమస్య

● నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి



ఆత్మకూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): అపార్థం చేసుకోవడం వల్లే ఆత్మకూరులో టీడీపీ శ్రేణుల ఆందోళన సమస్య ఉత్పన్నమైందని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి స్పష్టత ఇచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆత్మకూరులో ఆమె మీడియాతో మాట్లాడారు. మంత్రి నారాలోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర సందర్భంగా జిల్లాలో అనేక మంది దివ్యాంగులు తమకు తోపుడుబండ్లు, మోటారు సైకిళ్ల కావాలని అభ్యర్థిం చినట్లు చెప్పారు. ఇందులో భాగంగానే తాము అధికారంలోకి వస్తే.. దివ్యాంగులందరికి పరికరాలను పంపిణీ చేస్తామని హామీ ఇచ్చానట్లు చెప్పారు. అయితే రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా కేంద్ర ప్రభుత్వం, అలెన్‌కో సంస్థ సహకారంతో నంద్యాలలో మాత్రమే దివ్యాంగులకు పరికరాల పంపిణీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డితో తాను హాజరయ్యేందుకు ఆత్మకూరుకు వచ్చానని అన్నారు. మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి బ్రేక్‌ఫాస్ట్‌కు పిలవడంతో మర్యాదపూర్వకంగా ఆయన ఇంటికి వెళ్లాలని చెప్పారు. ఆక్రమంలోనే అనవసరమైన అపార్థం చేసుకోవడంతోనే ఈ సమస్య ఉత్పన్నమైందని వివరించారు.

పీజీ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలో పీజీ 4వ సెమిస్టర్ ఫలితాలను ఇన్‌చార్జి ఉపకులపతి వి. వెంకట బసవరావు విడుదల చేశారు. ఏప్రిల్ 15 నుండి 19 వరకు నిర్వహించిన పరీక్షల్లో 51 మంది విద్యార్థులు రాయగా 51 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు, పరీక్షల విభాగం డీన్ కే. నాగరాజ్ శెట్టి, కంట్రోలర్ కే. బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.



పరీక్షల ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ

చిత్రజ్యోతి


★ SINCE 1965 ★

రెండో షెడ్యూల్‌లో ఎన్సీ 24




నాగచైతన్య కథానాయకుడిగా కార్తీక్ దండు దర్శకత్వంలో ఓ చిత్రం (ఎన్సీ-24-వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోంది. బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. శుక్రవారం హైదరాబాద్‌లో రెండో షెడ్యూల్‌ను ప్రారంభించినట్లు యూనిట్ తెలిపింది. నెలరోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో నాగచైతన్యతో పాటు ప్రధాన తారాగణం అంతా పాల్గొంటోంది. ఈ సందర్భంగా యూనిట్ నాగచైతన్య పోస్టర్‌ను విడుదల చేసింది. ఒక చేతిలో గొడ్డలి, మరో చేతిలో తాడుతో మాస్ లుక్‌లో నాగచైతన్య ఆకట్టుకున్నారు. ఈ చిత్రానికి అజనీష్ బి లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రఘుల్ ధరుమాన్

వైరల్ వయ్యారి



గాలి జనార్ధన్ రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి కథానాయకుడిగా పరిచయమవుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'జూనియర్'. రాధాకృష్ణ దర్శకత్వంలో వారాహి చలనచిత్రం బేనర్‌పై రజనీ కొర్రపాటి నిర్మించారు. శ్రీలీల కథానాయిక. ఈ నెల 18న ఈ చిత్రం విడుదలవుతోంది. చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. 'జూనియర్' నుంచి రెండో పాటను యూనిట్ శుక్రవారం విడుదల చేసింది. 'వైరల్ వయ్యారి' అంటూ సాగే ఈ గీతానికి కల్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించారు. దేవి శ్రీ ప్రసాద్ స్వరాలందించడంతో పాటు హరిప్రియతో కలసి ఆలపించారు. దేవి సంగీతంతో పాటు కిరీటి రెడ్డి, శ్రీలీల స్టెప్పులు ఈ పాటకు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కె. కె. సెంథిల్ కుమార్

పల్లెటూరి సరదాలు



మనోజ్ చంద్ర, మోనిక టి, ఉషా బోసెల ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న గ్రామీణ నేపథ్య వినోదాత్మక చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నటి, నిర్మాత ప్రవీణ పరుచూరి ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. రానా దగ్గుబాటి సమర్పణలో గోపాల కృష్ణ పరుచూరి, ప్రవీణ పరుచూరి నిర్మిస్తున్నారు. ఈనెల 18న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ఈ చిత్ర టీజర్‌ని విడుదల చేశారు. మనోజ్ చంద్ర రికార్డ్ డ్యాన్స్ స్టూడియోని నడుపుతున్న యువకుడిగా కనిపించాడు. పల్లెటూరి జీవితాన్ని, సరదాలని అద్భుతంగా ఈ చిత్రంలో చూపించబోతున్నామని చిత్రబృందం పేర్కొంది.

జెన్కో జోరు.. రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి

- మార్కెట్లో కొనకుండానే కరెంటు సరఫరా
- అందుబాటులోకి శ్రీశైలం జలవిద్యుత్
- మొత్తం 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి
- డిమాండ్‌కు సరిపడా అందడంతో.. బయట కొనుగోలు చేయని డిస్కంలు

అమరావతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్లో విద్యుత్ కొనుగోళ్లకు వెళ్లకుండానే.. డిమాండ్‌కు సరిపడా కరెంటును ఏపీ జెన్‌కో ఉత్పత్తి చేస్తోంది. శుక్రవారం రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసింది. రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థలు అందించిన సమాచారం మేరకు.. శుక్రవారం 199.498 మిలియన్ యూనిట్లను అవి ఉత్పత్తి చేశాయి. దీంతో.. మార్కెట్లో ఒక్క యూనిట్‌ను కూడా కొనుగోలు చేయకుండా డిస్కంలు డిమాండ్‌ను తట్టుకున్నాయి. శుక్రవారం ఏపీ జెన్కో ఆధ్వర్యంలోని థర్మల్ విద్యుత్కేంద్రాల్లో 78.015 మిలియన్ యూనిట్లు, జలవిద్యుత్కేంద్రాల్లో 19.869 మిలియన్ యూనిట్లు, జెన్కో సోలార్ కేంద్రాల్లో 1.588 మిలియన్ యూనిట్లు, సెంట్రల్ జనరేటింగ్ స్టేషన్లు 10.938 మిలియన్ యూనిట్లు, ఐపీపీ (సెయిల్, హెచ్ఎన్‌పీసీఎల్) 37.945 మిలియన్ యూనిట్లు, పవన విద్యుత్ 57.946 మిలియన్ యూనిట్లు, ప్రైవేటు సోలార్ 18.383 మిలియన్ యూనిట్లు, అంతర్రాష్ట్ర ఉత్పత్తి 1.206 మిలియన్ యూనిట్లు.. మొత్తం 199.498 మిలియన్ యూనిట్లను విద్యుత్ సంస్థలు అందించాయి. డిమాండ్ కూడా అంతే ఉండడంతో డిస్కంలు మార్కెట్లో కొనుగోలు చేయలేదు. శ్రీశైలం కుడిగట్టు జలవిద్యుత్కేంద్రంలో ఉత్పత్తి కొనసాగుతోంది. 720 మెగావాట్లు అందుబాటులోకి వచ్చింది. కృష్ణపట్నం థర్మల్ మూడో యూనిట్ నుంచి 750 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయింది. వీటితో కలిపే 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ఇంకోవైపు.. థర్మల్ విద్యుదుత్పత్తి బాగానే ఉన్నందున ప్లాంట్లలో బొగ్గు నిల్వలను ఇంకా పెంచాలని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు. వీటీపీఎస్‌లో రోజుకు 41,500 మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం కాగా.. 13 రోజులకు సరిపడా 5,48,586 టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఆర్‌టీపీపీలో రోజుకు 28,500 టన్నులు అవసరం కాగా.. రెండున్నర రోజులకు సరిపడా 74,549 టన్నుల నిల్వలే ఉన్నాయి. కృష్ణపట్నం థర్మల్ ప్లాంట్‌లో రోజుకు 29,000 టన్నుల బొగ్గు అవసరం కాగా.. భారీగా 2,30,020 టన్నుల నిల్వలు ఉన్నాయి. సెయిల్‌లో రోజుకు 20,000 మెట్రిక్ టన్నుల బొగ్గుకు గాను 4,72,705 టన్నుల నిల్వలు ఉన్నాయి.

బకాయిలతో డిస్కంలు విలవిల..

రూ.7,562.48 కోట్ల బకాయిలు రాష్ట్ర డిస్కంలను భయపెడుతున్నాయి. నెలలోపే విద్యుత్ బకాయిలను తీర్చాలన్న నిబంధనలను దాటిన మొత్తాలు రూ.3,513.34 కోట్లు ఉన్నాయి. ఈ నెలలో చెల్లించాల్సిన బకాయిలు రూ.4,049.14 కోట్లు. ఈ మొత్తాలను తీర్చడానికి నిధుల కోసం డిస్కంలు అన్వేషణ ప్రారంభించాయి. అప్పులు తీర్చడానికి కొత్త అప్పులు చేయడానికి సిద్ధమవుతున్నాయి.

ఇక 'స్మార్ట్' రేషన్ కార్డులు

- ఏటీఎం కార్డుల్లా రూపకల్పన
- క్యూఆర్ కోడ్‌తో వివరాలు ప్రత్యక్షం
- పాత కార్డుల స్థానంలో కొత్త కార్డులు
- నేతల ఫొటోలు లేకుండా ముద్రణ
- ప్రభుత్వ అధికారిక చిహ్నం, లబ్ధిదారు ఫొటో ఉండేలా చర్యలు
- సిద్ధమవుతున్న కొత్త స్మార్ట్ కార్డులు
- వచ్చే నెలలో పంపిణీకి ఏర్పాట్లు



అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్ కార్డుల రూపుమారుతోంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం కార్డులకు పార్టీ రంగులు పులిమేసి.. వాటిపై ఒకవైపు జగన్ బొమ్మ, మరోవైపు వైఎస్ రాజశేఖరరెడ్డి బొమ్మను ముద్రించి పంపిణీ చేసింది. ఇప్పుడు వాటికి స్వస్తి చెప్పి.. రాజకీయ పార్టీల రంగులు లేకుండా, నేతల బొమ్మలు ముద్రించకుండా కొత్త కార్డులను రూపొందిస్తున్నారు. పాత వాటి స్థానంలో ఈ కొత్త కార్డులు జారీ చేయడంతో పాటు ఇకపై కొత్తగా మంజూరు చేసే కార్డులన్నీ కూడా స్మార్ట్ కార్డులుగానే ఉండనున్నాయి. బ్యాంకు ఏటీఎం కార్డు తరహాలో క్యూఆర్ కోడ్‌తో ఈ స్మార్ట్ రేషన్ కార్డును రూపొందిస్తున్నారు. ఈ కార్డుల జారీకి పౌరసరఫరాల శాఖ ఇప్పటికే కసరత్తును పూర్తి చేసింది. స్మార్ట్ రేషన్ కార్డుపై ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, మరోవైపు కార్డుదారు (కుటుంబ పెద్ద) ఫోటో ఉంటాయి. ఆ రేషన్ కార్డు నంబరు, రేషన్‌షాపు నంబరు తదితర వివరాలుంటాయి. కార్డు వెనుకవైపు లబ్ధిదారు కుటుంబ సభ్యుల వివరాలుంటాయి. ఈ స్మార్ట్ రేషన్ కార్డును రేషన్ డీలర్ల వద్ద ఉండే ఈ-పోస్ యంత్రాల సహాయంతో స్కాన్ చేస్తే ఆ కుటుంబానికి సంబంధించిన వివరాలతో పాటు రేషన్ సరుకుల వినియోగానికి సంబంధించిన పూర్తి సమాచారం ప్రత్యక్షమవుతుంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించే ఈ కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ముద్రణ కోసం ఏపీటీఎస్ ద్వారా టెండరు ప్రక్రియ పూర్తి చేశారు. ప్రస్తుతం ముద్రణ దశలో ఉన్న కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను వచ్చే నెలలో పంపిణీ చేసేందుకు పౌరసరఫరాలశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

2 లక్షల కుటుంబాలకు కొత్తగా లబ్ధి

రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 1.46 కోట్లకుపైగా కుటుంబాలకు రేషన్ కార్డులు ఉన్నాయి. వైసీపీ హయాంలో అర్హతలున్న నవదంపతులు, పేదలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నా అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో లక్షల సంఖ్యలో దరఖాస్తులు మూలనపడి ఉన్నాయి. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో అర్హులైనవారందరికీ కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసింది. దీంతోపాటు తల్లిదండ్రుల నుంచి వేరుపడిన వారికి స్ప్లిట్ కార్డులు, ఉన్న రేషన్ కార్డులలో సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామాల మార్పులకు అవకాశం కల్పిస్తూ గత మే నెలలో దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. దీంతో ప్రతి జిల్లా నుంచి లక్షలాదిగా వచ్చిపడిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల కోసం 1,47,187 మంది దరఖాస్తులు చేసుకోగా.. వారిలో 89,864 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 38,046 మంది దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. కుటుంబ విభజన (స్ప్లిట్) కార్డుల కోసం 1,43,745 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 1,09,787 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 20,403 దరఖాస్తులను తిరస్కరించారు. ఇలా కొత్తగా మంజూరు చేసిన దాదాపు 2 లక్షల కొత్త రేషన్ కార్డులలోని లబ్ధిదారులకు సెప్టెంబరు నెల నుంచి రేషన్ సరుకులు పంపిణీ చేసే అవకాశం ఉంది. కొత్తగా వచ్చిన కార్డులతో రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 1.48 కోట్లకు చేరింది.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు

శాంతిభద్రతలను కాపాడాలి


ఎస్ఐని కలిసిన టీడీపీ నాయకులు

తుగ్గలి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో అల్లర్లు జరగకుండా శాంతిభద్రతలు కాపాడాలని మాజీ ఎంపీపీ, వైస్ ఎంపీపీలు కొమ్మె వెంకటేశ్, చంద్రశేఖర్ యాదవ్, మాజీ సర్పంచ్ బర్మా వీరేష్ కోరారు. శుక్రవారం తుగ్గలి ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ బాలనరసింహులును మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, పూలమాలలు వేసి సన్మానించారు. వారు మాట్లాడుతూ మొహర్రం వేడుకల్లో గ్రామాల్లో ఎలాంటి అల్లర్లు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డీలర్ తిమ్మప్ప, వెంకటేశ్వర్లు ఉన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి

తుగ్గలి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో పండించిన పంటలను అమ్ముకోవడానికి ఇబ్బందులు పడుతున్న రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని పత్తికొండ మార్కెట్ యార్డు డైరెక్టర్ రామచంద్ర అన్నారు శుక్రవారం జొన్నగిరిలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పొత్తులు మరవకుండా జనసేన పార్టీకి చెందిన తనకు పత్తికొండ మార్కెట్ యార్డు డైరెక్టర్ పదవి ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి కమిటీ దృష్టికి తీసుకెళ్లి ఆ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. మార్కెట్ యార్డు డైరెక్టర్‌గా ఎంపిక చేసిన పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, జనసేన తాలుకా ఇన్‌చార్జి రాజశేఖర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు బాలన్న, రవి యాదవ్, ఓబులేసు, సురేష్, బలరాముడు, శేఖర్ ఉన్నారు.

పంటల బీమా తప్పనిసరి

తుగ్గలి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ప్రధానమంత్రి ఫజల్ బీమా యోజన పథకం కింద బీమాను చేసుకోవాలని ఏవో సురేష్ యాదవ్ తెలిపారు.శుక్రవారం మండల కేంద్రమైన తుగ్గలి వ్యవసాయ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 2025-26 సంవత్సరంలో సాగు చేసిన ఉల్లి, మిరప, జొన్న, వరి, మొక్కజొన్న, సజ్జ వంటి పంటలకు ప్రీమియం చెల్లిస్తే పంటలు నష్టపోతే ప్రీమియం చెల్లించిన రైతులకు బీమా అందుతుందన్నారు. ఎకరాకు రైతులు చెల్లించాల్సిన ప్రీమియం వాటా కొర్ర పంటకు రూ.32లు, మొక్కజొన్నకు రూ.66లు, ఉల్లికి రూ.90, సజ్జ రూ.32, కందులు రూ.44, ఎండు మిర్చి రూ.360లు, జొన్నలు రూ.38లు, పత్తి రూ.2వేలు, వేరుశనగ రూ.560లును ఈ నెల 31వ తేదీలోపు చెల్లించాలన్నారు.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎస్ఐ విజయకుమార్ నాయక్

మద్దికెర, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ విజయకుమార్ నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక విద్యాసాయి కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల నుంచి మీ ఫోన్‌లకు కాల్స్ కానీ, మెసేజ్‌లు కానీ వస్తే రిసీవ్ చేయవద్దని అన్నారు. సైబర్ నేరస్థులు ఎవరైనా ఫోన్ చేస్తే 1930కి కాల్ చేయాలన్నారు. సైబర్ నేరాల పట్ల అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో విద్యాసాయి కళాశాల ఎండీ వెంకటమాధవ్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు


స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

మద్దికెర, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ పంచాయతీకి చెందిన ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ గుండాల్ నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక రెవెన్యూకి చెందిన పందుల కుంట స్థలంలో అన్యాక్రాంతమైన స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ స్థలాలను ఆక్రమిస్తే ఎంతటి వారినైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ రామదాసు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

మద్దికెర, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వర్షాలను దృష్టిలో ఉంచుకుని పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వం స్వచ్ఛ సంకల్పం పేరిట ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేస్తుందన్నారు. పంచాయతీల్లోని డ్రైనేజీ, గుంతలు, రహదారులు శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పరమేశ్వరప్ప, వన్నూరప్ప ఉన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఆదోని టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : విద్యను వ్యాపారంగా మార్చుకున్న ప్రైవేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి శ్రీనిత్ రాయల్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సాయినాథ్ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ, విద్యా హక్కు చట్టం కింద 25 శాతం రిజర్వేషన్ అమలు చేయడం లేదన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం



మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శిశిర దీప్తికి మొక్కను అందజేస్తున్న ప్రిన్సిపాల్ సురేంద్రబాబు

ఆదోని అగ్రికల్చర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు విద్యార్థి దశ నుంచే నడుం బిగించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శిశిర దీప్తి అన్నారు. శుక్రవారం భాష్యం పాఠశాలలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ సురేంద్ర బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ర్యాలీ చేపట్టి 500 మొక్కలను విద్యార్థులతో నాటించారు. వైస్ ప్రిన్సిపాల్ భార్గవ్, శిరీష పాల్గొన్నారు.

ఆరోగ్యం, చదువూ రెండూ ముఖ్యమే

మద్దికెర, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం, చదువూ రెండూ ముఖ్యమేనని ఎంఈవో-2 మోహన్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్యపరీక్షలు చేశారు. ఎంఈవో-2 మోహన్ మాట్లాడుతూ విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకుని భోజనం చేయాలన్నారు. విద్యార్థులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వాంతులు, విరేచనాలు అయిన వెంటనే వైద్యశాలకు రావాలని తెలిపారు. ఆరోగ్యం పట్ల ఎవరూ కూడా నిర్లక్ష్యం వహించకూడదన్నారు. అనంతరం వైద్య సిబ్బంది విద్యార్థులు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పెద్దహుల్తిలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు


తుగ్గలి మండలం సూర్యతాండలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న టీడీపీ నాయకులు


ఆదోని: సలకలకొండలో ప్రజలకు సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు

హామీలు 90 శాతం అమలు చేశాం

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో నాయకులు

ఆదోని, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 90 శాతం వరకు కూటమి ప్రభుత్వం అమలు చేసిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు అన్నారు. శుక్రవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని సలకలకొండ, అలసందగుత్తి, బసరకోడు గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ కూటమి యేడాది పాలనపై కరపత్రాలు పంపిణీ చేశారు. మీనాక్షినాయుడు మాట్లాడారు. ఆర్థిక సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని అభివృద్ధి మార్గంలోకి తీసుకొచ్చేందుకు సీఎం చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్, బీజేపీ పెద్దలు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని ప్రధాన సమస్య తాగునీటి సమసయను రాబోయే రెండేళ్లలో ప్రతి ఇంటికి కుళాయి ద్వారా మంచినీటిని అందిస్తామని, ఆ విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఎవరికైనా అందకపోతే కూటమి నాయకులను సంప్రదిస్తే వారికి పథకాలు అందేవిధంగా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ కురువ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప, టీడీపీ సీనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డి, రామస్వామి, కృష్ణమ్మ, ఉమ్మి సలీం, ఉరుకుందరెడ్డి, వీరా, యువ నాయకులు భూపాల్‌చౌదరి, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్‌చౌదరి పాల్గొన్నారు.

కూటమితోనే అభివృద్ధి సంక్షేమ ఫలాలు

తుగ్గలి: కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందుతాయని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు అన్నారు. శుక్రవారం మండలంలోని సూర్యతాండ, మీటేతండా, బాటతాండ గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను అడుగుతూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాముా నాయక్, శంకర్ నాయక్, సర్పంచ్ శంకరమ్మ, వెంకటస్వామి, చంద్రశేఖర్ యాదవ్, శ్రీనివాసులుగౌడు, మిద్దె వెంకటేశ్ యాదవ్, రవికుమార్, బాలన్న, నక్కలదొడ్డి రమేష్, బర్మా వీరేష్, మాజీ సర్పంచ్ ఫక్కీరప్ప, వెంకట్రాముడు చౌదరి, లక్ష్మన్న ఉన్నారు.

వెల్దుర్తి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడు అన్నారు. స్వగృహంలో వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్‌గౌడు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం చేపట్టారన్నారు. ప్రభుత్వం చేపట్టిన పథకాల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. బీసీ గర్ల్స్ హాస్టల్-2 ఏర్పాటు, నీటి సమస్య పరిష్కారానికి, బీసీ బాలుర హాస్టల్ ఏర్పాటుకు, వెల్దుర్తి ట్రాఫిక్ సమస్యతో పాటు జ్యోతిబాపూలే సొంత భవనానికి ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సహకారంతో పరిష్కారం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సూదేపల్లె జయరాముడు, సిద్దనగట్టు వెంకటేశ్వర్లు, రత్నపల్లె ఆనంద్, వీరభద్రుడు, వడ్డె మల్లికార్జున తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్దికెర: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని మాజీ జడ్పీటీసీ సభ్యులు పి. పురుషోత్తంచౌదరి, జమేదార్ రాజన్న యాదవ్, జిల్లా టీడీపీ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు పేర్కొన్నారు. శుక్రవారం మద్దికెర గ్రామంలో మండల టీడీపీ అధ్యక్షులు ఎన్. లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలును ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఇంటింటికి తిరిగి ప్రజలకు సంక్షేమ పథకాలు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్రశేఖర్‌గౌడు, రంగయ్య, గద్దం రామాంజులు, సతీష్ కుమార్, భీమరాజు, గుడిఎల్లప్ప, పారా విఠోబ, గూడూరు కవిత, రఘు యాదవ్, ఆంజనేయ, చంద్రమోహన్, తదితరులు ఉన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే మీ వద్దకు..

పత్తికొండ: ఏడాది పాలనలో ఎంతో అభివృద్ధి చేశాం... ఇంకా మీ సమస్యలు ఏమైనా ఉన్నాయో తెలుసుకుని పరిష్కరించేందుకు మీవద్దకు వస్తున్నామని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ప్రజలకు వివరించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం పత్తికొండ మండలపరిధిలోని పెద్దహుల్తి, పత్తికొండ పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీల్లో ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. పెద్దహుల్తిలో హుల్తిలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ప్రభుత్వపథకాలు అందుతున్నాయా.. అందకపోతే ఎందువల్ల అన్న అంశాలపై ప్రజలను అడిగితెలుసుకున్నారు. సమస్యలు పరిష్కారం కావడంలేదని ఫిర్యాదులు అందినచోట ఆ వివరాలను నమోదు చేసుకుని సమస్యను పరిష్కరించాలని వెంట ఉన్న సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో నాయకులు సాంబశివారెడ్డి, పర్లశ్రీనివాసులు, వెంకటపతి, తిమ్మయ్యచౌదరి, బత్తినిలోక్‌నాథ్, కడవల సుధాకర్, మాజీసర్పంచ్ తిప్పన్న గ్రామ నాయకులు మానిక్యరెడ్డి, పరిపూర్ణగౌడ్, ప్రకాష్, పర్లరమేష్ ఉన్నారు.

కార్యకర్తే టీడీపీకి అధినేత.. ఎంపీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు


మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

ఆదోని, జూలై 4(ఆంధ్రజ్యోతి): టీడీపీకి కార్యకర్త అధినేత అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆలూరు నియోజకవర్గం త్రీమెన్ కమిటీ సభ్యులు, కర్నూలు జిల్లా ఎంపీ బస్తిపాటి నాగరాజు, కడప ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ పూల నాగరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి ఆలూరుకు వెళ్తుండగా మార్గమధ్యంలో మారుతినాయకుడు కార్యాలయంలో కొంత సేపు సేద తీరారు. తొలి అడుగు సుపరిపాలన, ఆదోని నియోజకవర్గం అభివృద్ధిపై చర్చించారు. ఏపీని అభివృద్ధిలో గతంలో నడిపేందుకు, దేశంలోనే నెంబర్ వన్ స్థానాన్ని దక్కించుకునేందుకు సీఎం చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, లోకేష్‌బాబు అహర్నిశలు కష్టపడుతున్నారు. గ్రూపు రాజకీయాలు పక్కన పెట్టి అభివృద్ధి కోసం మనవంతు సహకారం అందిస్తే అప్పుడే జిల్లా అభివృద్ధి చెందుతున్నారు. కార్యక్రమంలో యువ నాయకులు భూపాల్‌చౌదరి, మారుతినాయుడు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్‌చౌదరి, టీడీపీ నాయకులు, కురువ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున, లోకేష్, వినయ్ పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూళ్ల సమస్యలను పరిష్కరించాలి

ఆదోని అగ్రికల్చర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలని ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు గోపాల్ రెడ్డి, నాగేంద్ర కృష్ణమూర్తి దసరాముడు కోరారు. శుక్రవారం ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎంఈవో భూపాల్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

బసాపురం చెరువుకు మరమ్మతులు చేపట్టాలి

ఆదోని టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : బసాపురం చెరువుకు మరమ్మతులు చేపట్టాలని మాజీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో చెరువు గట్టు మూడు సార్లు కుంగిపోయి సిమెంట్ కాంక్రీట్ పలకలు జారిపోవడం నాయకుల, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. ఐదేళ్లు అవుతున్నా మరమ్మతులు చేపట్టలేదని ఆరోపించారు. ఎల్ఎల్‌సీ కాలువలో నీరు ఉన్నా చెరువవులో నింపుకోలేని దుస్థితి ఏర్పడిందన్నారు. ఎస్‌కెడీ కాలనీలో వారం రోజులుగా తాగు నీటి సరఫరా చేయలేదని, రానున్న రోజులలో సమస్య మరింతగా పెరిగే ప్రమాదం ఉందన్నారు. వెంటనే అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోతే ప్రజలు తీవ్ర నీటి ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. చెరువుకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని కోరారు.

ఆస్పరిలో పీర్ల దేవుడికి అర కిలో వెండి


పీర్ల దేవుడి పూజారులకు అరకేజీ వెండిని అందజేస్తున్న భక్తుడు రాజశేఖర్

ఆస్పరి, జూలై 4(ఆంధ్రజ్యోతి): కొలిచే వారికి కొంగుబంగారంగా విరాజిల్లుతున్న పీర్ల పెద్ద దేవుడికి మండలకేంద్రం ఆస్పరిలో దబ్బల రాజశేఖర్ అనే భక్తుడు రూ.1.30 లక్షలు, అరకేజీ వెండి (ఊయల ప్రతిమ)ని శుక్రవారం అందించి మొక్కుబడి చెల్లించుకున్నారు. స్థానిక పెద్ద దేవుడి చావిడిలో కొలువుదీరిన పీర్లకు ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు.

సమ్మతగేరిలో క్షుద్ర పూజలు

● భయాందోళనలో రైతులు
● విచారిస్తున్న పోలీసులు


క్షుద్ర పూజలు జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ దిలీప్‌కుమార్

హొళగుంద, జూన్4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సమ్మతగేరి గ్రామ శివారులో ఉన్న ఓ పొలంలో క్షుద్ర పూజలు గ్రామంలో కలకలం రేపింది. జేసీడీతో తవ్వకాలు జరిపి పూజలు చేసిన ఆనవాళ్లు కనిపించడంతో శుక్రవారం రైతులు, గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ దిలీప్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గ్రామస్థులు క్షుద్ర పూజలు చేశారు..? లేక కొత్త వ్యక్తులు వచ్చి ఇక్కడ పూజలు చేశారా...? వారికి ఎవ్వరూ సహకరించారు అనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

నీటి సమస్యను పరిష్కరించండి

వెల్దుర్తి, జూలై 4(ఆంధ్రజ్యోతి): వెల్దుర్తిలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని టీడీపీ జిల్లా నాయకుడు సుబ్బరాయుడు కోరారు. శుక్రవారం వెల్దుర్తి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సుహాసినమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ మునెయ్య, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనాథ్‌లతో మాట్లాడారు. జనాభాకు సరిపడా నీటి వనరులు పుష్కలంగా ఉన్నా నీటి సమస్య ఎందుకు వస్తోందని అధికారులను ప్రశ్నించారు. ప్రజలెవరూ నీటి సమస్య కోసం కార్యాలయాల చుట్టూ, రోడ్డెక్కకుండా ముందుస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

స్థానిక ఎన్నికల్లో ఘన విజయం సాధించాలి


ఎంపీ నాగరాజుకు, తిక్కారెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు

చిప్పగిరి, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నికల్లో సర్పంచులు ఎంపీటీసీలు జడ్పీటీసీలు తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు ఘన విజయం సాధించేందుకు పార్టీ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని ఎంపీ నాగరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం చిప్పగిరిలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తల విస్తృత సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ నాగరాజు మాట్లాడుతూ ఆలూరు నియోజకవర్గంలో తాగునీరు, రోడ్లు సాగునీటి ప్రాజెక్టులు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కార్యకర్తలందరూ కలిసికట్టుగా పనిచేసి నియోజకవర్గంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలను అత్యధిక మెజార్టీతో గెలిపించుకొని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కానుకగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ పార్టీ పరిశీలకులు పూల నాగరాజు, జిల్లా జడ్పీటీసీ సంఘం మాజీ అధ్యక్షుడు మీనాక్షి నాయుడు, టీడీపీ నాయకులు ఎల్లంకి రజిని, బెల్దోన వెంకటేష్, టీడీపీ మండల కన్వీనర్ షేక్షావలి, రామదుర్గం మాధవులు, బెల్దోన భీమ లింగప్ప, ఏరూరు నరసింహులు, మిరపకాయల చంద్ర సర్పంచులు పురుషోత్తం సుశీలమ్మ, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీని ఎదుర్కొలేకనే త్రిసభ్య కమిటీ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

హాలహర్వి, జూలై 4(ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గంలో వైసీపీ ఆదరణ చూసి ఓర్వలేకనే తెలుగుదేశం పార్టీ త్రిసభ్య కమిటీని నియమించిందని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. శుక్రవారం చత్రగుడి కళ్యాణమండపంలో జరిగిన కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. 30 ఏళ్లుగా ఆలూరు నియోజకవర్గంలో టీడీపీ తరపున అభ్యర్థి గెలవలేదన్నారు. ముఖ్యమంత్రి తప్పుడు హామీలతో ప్రజలను మభ్యపెట్టి గెలుపొందారని, యేడాదికే టీడీపీ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందన్నారు. అందువల్ల గ్రామాల్లోకి ప్రతి ఇంటి ఇంటింటికి తిరిగి చంద్రబాబు మోసాలపై ప్రజలకు వివరించాలని ఆయన కోరారు. తాను ఎల్లప్పుడు కార్యకర్తలకు అండగా ఉంటానని, కార్యకర్తలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కోనంకి జనార్ధన్‌నాయుడు, మండల కన్వీనర్ రామిరెడ్డి, బీసీ అధికార ప్రతినిధి అర్ధగేరి శ్రీనివాసులు, మొలగవల్లి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలను ఘనంగా జరుపుకుందాం

ఆదోని, జూలై 4(ఆంధ్రజ్యోతి): వినాయక ఉత్సవాలను ఘనంగా జరుపుకుందామని గణేష్ ఉత్సవకమిటీ నాయకులు ఎగ్గటి ప్రతాప్, కునిగిరి నీలకంఠ, బసవన్నగౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో గణేష్ ఉత్సవ కేంద్ర సమితి మొదటి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ గణేష్ మండపాల నిర్వాహకులు వినాయకుని విగ్రహం ఎత్తులో పోటీ పడకుండా 12 అడుగులలోపు విగ్రహం ఎత్తు ఉండేలా చూసుకోవాలని కోరారు. అదేవిధంగా విగ్రహానికి ఎక్కువ మొత్తంలో డబ్బు ఖర్చు పెట్టకుండా తక్కువ ఖర్చుతో విగ్రహం కొని ఎక్కువ ఖర్చు అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ వారు కూడా ఇప్పటి నుంచే వైర్‌ను తగినంత పైకి తీసుకుని కరెంట్ కోతలు లేకుండా ఎక్కడ కూడా చిన్న పొరపాటు జరగకుండా ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ వారు ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఈరన్నరావు, ఉపేంద్రకుమార్, చిన్నబసప్ప, ఆంజనేయులు, ప్రతాప్, పంపాపతి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


పుస్తకాలు పంపిణీ చేస్తున్న శ్రీనివాసాచారి

ఆదోని టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండిగిరి ప్రాంతంలోని మునిసిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో శుక్రవారం మాజీ కౌన్సిలర్, అండిగిరి టీడీపీ ఇన్‌చార్జి శ్రీనివాసాచారి విద్యార్థులకు పుస్తకాలు, పలకలను పంపిణీ చేశారు. ప్రతి ఏడాదిలాగే విద్యార్థులకు ఈ ఏడాది కూడా పంపిణీ చేస్తున్నామని, కూటమి అధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి జరుగుతోందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెడ్ మాస్టర్ సుజాత, డిష్ ఈరన్న, వెంకటేష్, రెహమాన్ పాల్గొన్నారు.

రోశయ్యకు ఘన నివాళి



రోశయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సంస్థ సభ్యులు

ఆదోని టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య 92వ జయంతిని పట్టణంలోని ఆవోపా సంస్థతో పాటు ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ సభ్యులు శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్ గుప్తా మాట్లాడుతూ, 16 సార్లు రాష్ట్ర ఆర్థిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనత రోశయ్యకి మరిచిపోలేరని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యక్షుడు శ్రీనాథ్ గుప్తా, కార్యదర్శి రఘు, కోశాధికారి వెంకటేశ్వరులు, రఘు బాబు, మహిళా విభాగ అధ్యక్షుడు వంకదారు మమతాశ్రీ, కార్యదర్శి శ్రీదేవి, సంతోషి, రాధిక పాల్గొన్నారు.

వంగవీటి వంగవీటి జయంతి


వంగవీటి మోహన రంగా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాపు బలిజ సంఘం నాయకులు

ఆదోని అగ్రికల్చర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : కాపు బలిజ నేత వంగవీటి మోహన్ రంగా జయంతి వేడుకలను శుక్రవారం కాపు బలిజల సంగం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక భీమాస్ హాలులో నిర్వహించిన జయంతి వేడుకల్లో ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రంమలో నాయకులు చందం మల్లికార్జున, శ్రీనివాసులు, లక్ష్మన్న, శేషన్న, బీమా, గోపాలకృష్ణ, ఎస్పీ శ్రీనివాసులు, సరసయ్య, రామకృష్ణ, సాల రంగన్న పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ నిర్మించాలి


ఎంపీ బస్తీపాటి నాగరాజుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దేవనకొండ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో మోడల్ స్కూల్ నిర్మాంచాలని ఏఐఎస్ ఎఫ్, సీపీఐ నాయ కులు కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుకు వినతి పత్రం అంద జేశారు. మండలంలో నిత్యం కరువు కాటకాలకు పేద విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారని సీపీఐ మండల కార్యదర్శి నర్సారావ్, ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్, మధు అన్నారు. దేవనకొండలో మోడల్ స్కూల్ నిర్మాణం, డీఎస్టీ హస్టల్‌ను పునః ప్రారంభించి, బాలికల హస్టల్ ఏర్పాటు చేయాలని కోరారు.

రైతన్నకు కరువైన యూరియా

● రెండు బస్తాల యూరియా కోసం రెండు రోజులు వేచి ఉండాల్సిందే.. ● కృత్రిమ కొరతను సృష్టిస్తున్న ఎరువుల దుకాణదారులు ● ఇబ్బందులకు గురవుతున్న అన్నదాతలు

ఎమ్మిగనూరు రూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): రైతన్నలు ప్రతియేటా ఎన్నో ఆశలతో పంటలను సాగు చేస్తారు.. అయితే వారు ప్రతియేటా ఏదో ఓ రూపంలో నష్టాలను చవిచూస్తునే ఉన్నారు. ఒక ఏడాది అతివృష్టి, మరో ఏడాది అనావృష్టితో.. పంటలు బాగా పండి అధిక దిగుబడి వస్తే ధరలు లేకపోవడంతోనో.. ఇలా ఏదో ఓ రూపంలో రైతన్నకు నష్టాలు తప్పడం లేదు. అయితే ఈ ఏడాది మే మొదటి వారం నుంచే వర్షాలు విస్తారంగా కురవడంతో రైతన్నలు ఎన్నో ఆశలతో పత్తి పంటలను సాగు చేశారు. ఈ ఏడాది ఎమ్మిగనూరు సబ్‌డివిజన్ పరిధిలో దాదాపు 16 వేల హెక్టార్లలో పత్తిపంటను సాగుచేశారు. గత నాలుగు రోజులుగా వర్షాలు విస్తారంగా కురవడంతో సాగు చేసిన పత్తి పంటకు ఎరువులు వేసే పనిలో రైతన్నలు నిమగ్నమయ్యారు. పంట ఏపుగా పెరిగే సమయంలో మంచి ఎరువులు వేస్తే పంట బాగాపండి అధిక దిగుబడి వస్తుందని రైతన్నలు ఎరువుల దుకాణాలను ఆశ్రయిస్తున్నారు. ఈ సమయంలో పత్తి పంటకు యూరియా ఎరువును వేయాల్సిన అవసరం ఎంతో ఉంది. అయితే ఇదే అదునుగా భావించి కొంతమంది ఎరువుల దుకాణదారులు యూరియా బస్తాలు లేవని రైతన్నలను వెనుదిరిగి పంపుతున్నారు. వాస్తవానికి యూరియా బస్తాలు ఉన్నప్పటికి ప్రైవేటు దుకాణదారులు అధిక రేట్లకు విక్రయించాలన్న దురుద్దేశ్యంతో ఎరువుల కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారని రైతన్నలు వాపోతున్నారు. వాస్తవానికి ఒక హెక్టార్‌కు దాదాపు 8 బస్తాల యూరియాను వేయాల్సి ఉంది. అయితే ఒక రైతుకు ఒకట్రెండు యూరియా బస్తాలను మాత్రమే అందజేస్తున్నారు. అదీ కూడా ఒక యూరియా బస్తాను తీసుకుంటే దానికి తోడు మరోరకం ఎరువుల బస్తాను తీసుకోవాలన్న నియమాన్ని పెట్టడంతో రైతన్నలు యూరియా బస్తాలను కొనలేని పరిస్థితి ఏర్పడింది. వాస్తవానికి ఒక యూరియా బస్తా రూ.275లకు విక్రయించాల్సి ఉంది. అయితే కొంతమంది ఎరువుల దుఖాణాదారులు ఒక యూరియా బస్తాను రూ.300 నుంచి రూ.350 వరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ బస్తాలు కూడా రైతులకు దొరకాలంటే గంటల పాటు దుకాణాల ముందు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి రైతన్నలకు యూరియా బస్తాలను అందజేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


ఎరువుల కోసం వేచి చూస్తున్న రైతులు

మూడు రోజులుగా తిరుగుతున్నా..



మాది ఎమ్మిగనూరు మండలం ఏనుగుబాల గ్రామం. నాపేరు ఆనందు. నాకు మూడు ఎకరాల పొలం ఉంది. పత్తి పంటను సాగు చేశా. వర్షాలు విస్తారంగా కురిశాయి. ఈ సమయంలో పత్తి పంటకు యూరియా వేస్తే మంచి దిగుబడి వస్తుందని ఆశించి మూడు రోజుల్నుంచి యూరియా కోసం ఎరువుల దుకాణాల చుట్టు తిరుగుతున్నా. ఎక్కడ కూడా యూరియా దొరకడంలేదు. యూరియా కోసం కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీకి మూడు రోజులుగా వస్తున్నా అయినా యూరియా దొరకడంలేదు.

- ఆనంద్, రైతు, ఏనుగుబాల

మరో రకం ఎరువుల బస్తాను తీసుకోవాలంటున్నారు

వర్షాలు విస్తారంగా కురియడంతో పత్తి పంటకు యూరియా వేస్తే పంట ఏపుగా పెరుగుతుందని అధిక దిగుబడి వస్తుందన్న ఆశతో యూరియాను తీసుకునేందుకు వచ్చా. ఇక్కడ యూరియా దొరకడం లేదు. ప్రైవేటు దుకాణాల్లోకి వెళ్తే అక్కడ ఒక యూరియా బస్తా రూ.300 నుంచి రూ.350 వరకు విక్రయించడంతో పాటు మరోరకం ఎరువు బస్తాను తీసుకోవాలని చెబుతున్నారు. వ్యవసాయ అధికారులు స్పందించి రైతులకు యూరియాను అందజేయాలి.

-బాబు, రైతు, మాచాపురం

లైసెన్స్ రద్దు చేస్తాం



ఈ ఏడాది ఎమ్మిగనూరు సబ్‌డివిజన్ పరిధిలో 16వేల హెక్టార్లలో పత్తి పంటను రైతులు సాగుచేశారు. అయితే రైతులందరికి యూరియాను అందజేస్తున్నాం. ఎవరైనా ఎరువుల దుకాణాదారులు యూరియా బస్తాను అధిక ధరలకు విక్రయిస్తే ఆదుకాణాదారుల లైసెన్స్‌ను రద్దు చేస్తాం.

శివ శంకర్, ఏవో, ఎమ్మిగనూరు

అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళి


అల్లూరి గురించి వివరిస్తున్న ఉపాధ్యాయుడు

గోనెగండ్ల, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నమరివీడు గ్రామ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. సీతా రామరాజు చిత్రపటానికి పూల వేసి నివాళి అర్పించారు. ఆయన దేశం కోసం చేసిన పోరాటాన్ని విద్యార్థులకు వివరించారు. ఆయన ప్రతి ఒక్కరికీ ఆదర్శ ప్రాయుడని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, లక్ష్మయ్య, కృష్ణ, మునెప్ప, మన్సూర్, విద్యార్థులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గోనెగండ్లలో చిన్న సరిగెత్తు


గోనెగండ్లలో పూజలు అందుకున్న పీర్లు

గోనెగండ్ల, జూలై 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గోనెగండ్లలో మోహర్రంను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున చిన్న సరిగెత్తు నిర్వహించారు. మేళతాళలతో పీర్ల దగ్గరకు ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక ప్రార్థన నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పీర్ల సవారి నిర్వహించారు. 6వ తేదిన మోహర్రం వేడుకలు నిర్వహిస్తున్నట్లు ముజావర్లు దరగల మాబు, ముల్లా రహీంబాషా తెలిపారు. మొహర్రంను మండలంలోని ప్రజలు కులమతాలకు అతీతంగా ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ విజయభాస్కర్ కోరారు. మొహర్రంను జరుపుకునేందుకు గాను ఆయా గ్రామాల ప్రజలు పోలీసులు దగ్గర అనుమతి తీసుకోవాలన్నారు. ఘర్షణలకు పాల్పడినా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారి పై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు. నిబంధనల ప్రకారం ప్రార్థనలు జరుపుకోవాలని సూచించారు.

సమ్మెకు విరామం


కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

ఎమ్మిగనూరు టౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : 59వ రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు శుక్రవారం తాత్కలికంగా సమ్మెను విరమించారు. ఈ సందర్బంగా స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అధ్యక్షులు నారాయణ, ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఐటి, విద్యా శాఖ నారా లోకేష్ మంత్రులతో వేసిన కమిటీతో సీడీఎంఏతో జరిపిన చర్చల్లో సానుకుల స్పందన రావడంతో సమ్మెను తాత్కాలికంగా విరమించారు. ఒక వేళ తమ డిమాండ్ పరిష్కరించకుంటే యథావిధిగా ఈనెల 16వ తేది నుంచి సమ్మెను కొనసాగిస్తామని మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేశారు.

మరో ఐదు రోజులు వర్షాలు

ఎమ్మిగనూరు రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో మరో ఐదు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 5,6,7,8,9 తేదీల్లో దాదాపు 5మి.మీ వర్షపాతం నమోదు అవుతుందన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే బనవాసి కృషి విజ్ఞాన కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు.

సమ్మెను జయప్రదం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు ప్రసాద్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు రాజు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో సార్వత్రిక సమ్మెకు సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ రంగసంస్థలను ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. సార్వత్రికసమ్మెలో కార్మికుల పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాప్, కిరణ్, హిజికెల్, స్వామిదాసు పాల్గొన్నారు.

రాఘవరాయలకు పుష్పాలంకరణ

మంత్రాలయం, జూలై 4(ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి బంగారు కవచం సమర్పణతో పాటు విశేష పుష్పాంకరణ చేశారు. మంచాలమ్మ దేవతకు విశేష పంచామృతాభిషేకం చేశారు. .గ్రామ దేవత మంచాలమ్మకు సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు.

మంత్రాలయంలో కిక్కిరిసిన భక్తులు: రాఘవేంద్ర స్వామి దర్శనార్థం భక్తులతో మంత్రాలయం కిక్కిరిసింది.శక్రవారం నవమి కావటంతో దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది.

పలు చోట్ల భారీ వర్షాలు


కోసిగిలో కురుస్తున్న వర్షం

కోసిగికోసిగి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కోసిగిలో మేఘాలు కిందికి దిగివస్తున్నట్లు కనిపిస్తున్న ఈ కారు మబ్బులు శుక్రవారం సాయంత్రం కోసిగిలోని తిమ్మప్పకొండ, బసవన్న కొండలపై ఆకాశంలోని నీటి మేఘాలు, నల్లమబ్బులు కిందకి దిగివస్తున్నట్లు ఆకాశంలో కాసేపు మేఘాలు సందడి చేశాయి. కారుమబ్బుల దృశ్యాన్ని కోసిగి ప్రజలు ఆసక్తిగా తిలకించి ఆనందపరవశులయ్యారు.

కౌతాళం: మండలంలో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురియడంతో వర్షపు నీటితో లోతట్లు ప్రాంతాలు జలమైనాయి. ముఖ్యంగా మండల కేంద్రమైన కౌతాళంలోని ప్రధాన దారులపై వర్షపునీరు చేరడంతో ప్రజలు, కాలనీవాసులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రెండు రోజులుగా కురిస్తున్న వర్షాలకు మండలంలో అన్నదాతలు వ్యవసాయ పనుల్లో బిజిబిజిగా గడుపుతూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మిగనూరు: ఎమ్మిగనూరు మండలంలో గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలోని పత్తితో పాటు ఉల్లి పంటల్లో నీరు నిలిచాయి. గత 15 రోజుల నుంచి వర్షం లేకపోవడంతో వరుణదేవుడి కోసం వేచి చూసిన రైతన్నలకు గత నాలుగు రోజులుగా వర్షాలు విస్తారంగ కురుస్తుండడంతో రైతన్నలు పంట పొలాల పనుల్లో నిమగ్నమయ్యారు.

63 వేల క్యూసెక్కుల నీరు విడుదల

మంత్రాలయం, జూలై 4(ఆంధ్రజ్యోతి): టీబీ డ్యామ్ నుంచి 20 గేట్లను 3అడుగుల ఎత్తులో ఎత్తి 63 వేల క్యూసెక్కుల నీటిని దిగువనున్న తుంగభద్ర నదికి విడుదల చేశారు. దీంతో ప్రముఖపుణ్యక్షేత్ర మైన శ్రీ మఠం వద్ద శనివారం తెల్లవారుజామున తుంగభద్ర నది వరదనీటితో ఉధృతంగా ప్రవహించనుంది. టీబీ డ్యాం నుంచి 63వేల క్యూసెక్కుల నీరు నదికి విడుదల అవుతుండగా డ్యాంలోకి ఇన్‌ఫ్లో 29,500 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో తుంగభద్రనది రెండువైపులా సరిహద్దులను తాకుతూ పరవళ్ల తొక్కనుంది. శుక్రవారం తాహశీల్దార్ రమాదేవి, జయరామిరెడ్డి, వీఆర్‌వో భీమన్న గౌడులు నది తీరాన్ని పరిశీలించారు. నదితీర గ్రామాల ప్రజలను తాహశీల్దారు రమాదేవి, సీడబ్ల్యూసీ అధికారులు, మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ గ్రామాల్లో అప్రమత్తం చేస్తున్నారు. పశువులకాపరులు, చేపలు పట్టేవారు, నదితీర గ్రామాల రైతులు నదిలోకి వెళ్లొద్దని తెలిపారు.

స్వర్ణ పల్లకిలో రాఘవేంద్రుడు


స్వర్ణ పల్లకిలో విహరిస్తున్న రాఘవేంద్రుడు

మంత్రాలయం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద్ర స్వామి స్వర్ణ పల్లకిలో భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం నవమి శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో మఠం అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవేంద్రస్వామి బృందావన ప్రతిమను స్వర్ణపల్లకిలో అధిష్టించి అంగరంగ వైభవంగా ఊరేగించారు .వివిధ రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున వచ్చిన భక్తుల జయధ్వనుల మధ్య శ్రీమఠం ప్రాంగణం చుట్టూ స్వర్ణ పల్లకి ఊరేగుతున్న దృశ్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు


ఫర్టిలైజర్ దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న ఏవో

కోసిగి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కోసిగితో పాటు గ్రామాల్లోని ఎరువుల దుకాణాదారులు రైతులకు అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం కోసిగిలోని పలు ఎరువుల దుకాణాలను ఆయన పరిశీలించి రికార్డులను తనిఖీ చేసి అనధికారికంగా రెండు గోదాములలో గోదాములలో నిల్వ ఉంచిన రూ.16.5 లక్షలు విలువ చేసే ఎరువులను సీజ్ చేశారు. రైతుల పిర్యాదు మేరకు ఎరువుల దుకాణాదారులు అధిక ధరలకు ఎరువులు అమ్ముతున్నారన్న సమాచారంతో అకస్మికంగా కోసిగిలోని పలు దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువులు అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

ప్రభుత్వం అండగా ఉంటుంది


చెక్కులను పంపిణీ చేస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం బాగాలేకపోయి సొంత డబ్బులతో చికిత్సలు చేయించుకున్న బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని నియోజకవర్గ ఇంచార్జి ఎన్ రాఘవేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మాధవరం తన నివాసంలో మంచాల కేడీసీసీ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేష్, ఎల్ఎల్‌సీ కాలువ అధ్యక్షులు మాలపల్లి చంద్ర, వరదరాజు,కంసలి నరసింహాలు ఆధ్వర్యంలో సీఎం సహాయనిధికింద నాలుగు మండలాల్లోని 21 మందికి మజూరైన రూ.8.49 లక్షలు చెక్కులను పంపిణీ చేశారు. ఇందులో పెద్దకడబూరు మండలానికి ముగ్గురికి రూ.1,17,551, కౌతాళం మండలానికి నలుగురికి 1,69,603, కోసిగి మండలానికి 6 మందికి గాను రూ.2,33,465, మంత్రాలయం మండలానికి 8 మందికి గాను రూ. 3,28471 మంజూరైన చెక్కులను ఆయా మండలాల టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో బాధితులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సీనియర్ నాయకులు రఘునాథరెడ్డి, రాకేష్ రెడ్డి, టీబీ డ్యాం బోర్డు ఛైర్మెన్ టిప్పు సుల్తాన్, సురేష్ నాయుడు, అడివప్పగౌడు, వెంకటపతిరాజు, రాఘవేంద్ర, శివ,లక్షన్న, వంశీ, గూర్కింటి భీమిరెడ్డి, నాగరాజు, రామయ్య రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార కిట్ల పంపిణీ

పెద్దకడబూరు , జూలై 4 (ఆంధ్రజ్యోతి): పెద్దకడుబూరు మండల పరిధిలోని హెచ్.మురవణి, పెద్దకడుబూరు మండలంలో పేద క్షయ వ్యాధిగ్రస్తులకు వైద్యులు రవిచంద్రకుమార్, ఫిర్‌దోస్త్, జిల్లా కోఆర్డినేటర్ పీపీఎం ఉమాపతి పోషకాహార కిట్లను గురువారం అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బాబురాజు, భాస్కర్, శ్రీధర్, కిశోర్‌కుమార్, సీహెచ్‌వో ఆదినారాయణ , సుశీల, లక్ష్మీనరసమ్మ, శ్రీదేవి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి


ఆర్టీసీ డిపో ముందు ఆందోళన చేస్తున్న కార్మికులు

ఎమ్మిగనూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ అధ్యక్షుడు రంగస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఈయూ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపోముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో సర్కిల్ అమలు పరచాలని, విలీనం కంటే ముందు ఉన్న ఈహెచ్ఎస్ సౌకర్యం కల్పించాలని, టీం డ్యామేజీపై ఇచ్చే రికవరీలు ఆపాలని, డీఏ బకాయిలు చెల్లించాలని, డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, బసవరాజు, నరసయ్య, చాంద్ బాషా, ఆర్‌హెచ్ నాయక్ పాల్గొన్నారు.

విరిగిపడిన చెట్టు.. తప్పిన ప్రమాదం


రోడ్డుపై విరిగిపడ్డ వృక్షం

ఎమ్మిగనూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హెచ్‌బీఎస్ కాలనీలో శుక్రవారం కురిసిన గాలివానకు ఓ ఇంటి ముందు ఉన్న చెట్టు విరిగిపడింది. అయితే ఆసమయంలో ఎవరు లేకపోవటంతో ప్రమాదం తప్పింది శుక్రవారం సాయంత్రం 4.30గంల సమయంలో భారీ గాలీతో పాటు ఓమోస్తారు వానకురిసింది. దీంతో హెచ్‌బీఎస్ కాలనీలోని పిరమిడ్ ధ్యాన కేంద్రంకు వెళ్లే దారిలో ఉన్న చెట్టు గాలికి విరిగిరోడ్డుపై పడింది. అప్పటికే స్కూళ్ల పిల్లలు ఇంటికి వెళ్లిపోవటం జరిగింది. దీంతో రోడ్డుపై ఎవరులేకపోవటంతో ప్రమాదం తప్పిపోయింది. సమాచారం తెలుసుకున్న వార్డు మున్సిపల్ కౌన్సిలర్ దయాసాగర్ అక్కడికి చేరుకొని సచివాలయం, మున్సిపల్ కమిషనర్‌కు సమాచారం అందించారు. చెట్టును తొలగించాలని కోరారు.

సుపరిపాలన చంద్రబాబుతోనే సాధ్యం


ఎమ్మిగనూరులో కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు


కోసిగిలో కరపత్రాలను ప్రదర్శిస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పార్టీ ఆదేశాలమేరకు పట్టణం, ఆయా మండలాల్లోని గ్రామాల్లో టీడీపీ శ్రేణులు ఇంటింటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం చేపట్టిన అబివృద్ధి సంక్షేమపథకాలను వివరిస్తు సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి మండలకేంద్రమైన నందవరంలో పర్యటించగా పట్టణంలోని ఆయా వార్డుల్లో వార్డు అధ్యక్షులు టీడీపీ కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బుగిడే నాగరాజు, డీలర్ బాషా, రవి, బచ్చాల రంగన్న, ఇబ్రహీం, రఘు, అంజి, మాభాషా, వలి, చిన్న, అన్వర్‌లు పాల్గొన్నారు.

కోసిగి: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు ముత్తురెడ్డి, మాజీ సాగునీటి సంఘం అధ్యక్షులు పల్లెపాడు రామిరెడ్డి అన్నారు. శుక్రవారం కోసిగిలోని 2వ వార్డులోని బూత్.నెం.100లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం అందించిన పథకాలను ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షులు నాడిగేని అయ్యన్న, మాజీ జడ్పీటీసీ తోవి రామకృష్ణ, నాడిగేని చిన్నతాయన్న, గవిగట్టు ఈరయ్య, నరసన్న, గాలెం వీరేష్, బసయ్య, ఈరారెడ్డి, తిక్కారెడ్డి, గోపాల్, కోసిగయ్య పాల్గొన్నారు.

కౌతాళం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే ప్రజల మన్ననలు పొందిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన కౌతాళంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి అయిన సందర్బంగా సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంను చేపట్టారు. శుక్రవారం మండల కేంద్రమైన కౌతాళంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప ఆధ్వర్యంలో మండల టీడీపీ నాయకులతో కలిసి శ్రీనివాసరెడ్డి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప, ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయపు ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్ శివ మోహన్ రెడ్డి, నాయకులు కోట్రేష్‌గౌడ్, రమేష్‌గౌడ్, దొడ్డనగౌడ్, కురుగోడు, కుంబళనూరు సర్పంచ్ వీరేష్ ఎరిగేరి మాజీ సర్పంచ్ చంద్ర శేఖర్, రాజబాబు, మంజునాథ, సిద్దు, రాజబాబు, చిరంజీవి వివిధ గ్రామాల టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.


కౌతాళంలో కరపత్రాలను ప్రజలకు అందిస్తున్న నాయకులు